22CTR1:22CTR1.qxd 10/22/2026 12:03 AM Page 1




# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త


## నామినేషన్ కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

తిరుపతి,అక్టోబర్ 21(ప్రభాతవార్త):



తిరుపతి జిల్లాలో జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ నేపథ్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్‌తో కలిసి జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ చేపట్టిన ఏర్పాట్లు, భద్రతా చర్యలు, పోలీసు బందోబస్తును పరిశీలించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## దుష్టశిక్షణ - శిష్టరక్షణకు ప్రతీకగా పార్వేట ఉత్సవం

తిరుమల,అక్టోబర్ 21(ప్రభాతవార్త)ప్రతినిధి:



శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల మరుసటిరోజు బుధవారం పార్వేట ఉత్సవం జరిగింది. తిరుమలలో ఉదయం నుండి భారీ వర్షం కురుస్తుండటంతో, శ్రీవారికి ప్రాతఃకాల ఆరాధన పూర్తయిన అనంతరం మలయప్పస్వామిని తిరుచ్చిపై ఊరేగింపుగా వైభవోత్సవ మండపానికి తీసుకొచ్చారు. అక్కడ స్వామివారికి ఆరాధన, నివేదన, హారతి సమర్పించిన అనంతరం ఉభయదారులు, తాళ్లపాకవారు, మఠం వారికి ఆలయ సంప్రదాయం ప్రకారం మర్యాదలు నిర్వహించారు.

### ప్రశాంత వాతావరణంలో

# ఎన్నికల ప్రక్రియ

### - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్, ఎస్పీ



నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు.

చిత్తూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా బుధవారం నుండి ప్రారంభమైన జడ్పీటిసీ, ఎంపిటిసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నదని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు పేర్కొన్నారు. జడ్పీ కార్యాలయంలో జడ్పీటిసీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు నామినేషన్ల కేంద్రంలో నామినేషన్ల దాఖలు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో జరుగుతున్న మున్సిపల్, స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ పూర్తయ్యిందని, దీనికి సంబంధించిన నామినేషన్ల పరిశీలిన ప్రక్రియ రెండు రోజుల క్రితమే జరిగిందని, ప్రస్తుతం నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ కొనసాగుత్నుదని, ఎన్నికల బరిలో నిలిచే అభ్యర్థుల జాబితా ఆధారంగా బ్యాలెట్ పేపర్ ప్రింటింగ్ కార్యకలాపాలు ప్రారంభించబడుతాయన్నారు. జిల్లాలో ఎలాంటి ఇబ్బందులు జరుగకుండా మున్సిపల్ ఎన్నికలను పూర్తి చేయడమే లక్ష్యంగా జిల్లా అధికార యంత్రాంగం పని చేస్తోందన్నారు. అలాగే జడ్పీటిసీ, ఎంపిటిసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యిందని, జిల్లాలో ఈ ఎన్నికలకు సంబంధించి బుధవారం నుండి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో జడ్పీటిసీ నామినేషన్ల దాఖలు కార్యక్రమంను పరిశీలించామని, జిల్లాలో ప్రశాంతంగా ఎన్నికల ప్రక్రియ సాగుతోందన్నారు. ప్రతి మండల ఎంపిడిఓ కార్యాలయం ఆవరణలో నాలుగు సిసి కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందని, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వెండర్ ద్వారా మరో మూడు సిసి కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పోలీస్ కంట్రోల్ రూమ్, కలెక్టరేట్ కంట్రోల్ రూమ్‌లకు అనుసంధానించడం జరుగుతుందన్నారు. రానున్న రెండు మూడు రోజుల్లో ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనంతనం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు జిడినెల్లూరు, నగరి నియోజకవర్గాల్లోని నామినేషన్ కేంద్రాలను తనిఖీ చేసి అధికారులకు తగు సూచనలు చేశారు.

## నామినేషన్లు ఉపసంహరించకుండానే ఏకగ్రీవాలు

చిత్తూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ మాయ చేసింది. కార్పొరేటర్లుగా పోటీ చేయడానికి నామినేషన్లు దాఖలు చేసిన అభ్యర్థులు ఎవరు నామినేషన్లను ఉపసంహరించ పోయిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. అధికార తెలుగుదేశం పార్టీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి తమ పార్టీకి చెందిన అభ్యర్థులు ఎవరు నామినేషన్లను ఉపసంహరించకపోయినా ఉపసంహరించినట్లు అధికారులు ప్రకటించారని దీనిపై న్యాయపోరాటం చేస్తామని వైకాపా నియోజకవర్గ ఇన్చార్జ్ ఎం సి విద్యానంద రెడ్డి తెలిపారు.

## ప్రశాంతంగా జడ్పిటిసి, ఎంపీటీసీ నామినేషన్లు

తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లాలో బుధవారం ఆయా మండలాల్లో చిన్న చిన్న గొడవల మధ్య పోలీసుల బందోబస్తు నడుమ ప్రశాంత వాతావరణంలో ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలకు నామినేషన్లను సంబంధిత మండలాలకు చెందిన అభ్యర్థులు దాఖలు చేశారు. ప్రధానంగా జడ్పిటిసి ఎన్నికలకు సంబంధించి కాంగ్రెస్ 1, జనసేన 6, టిడిపి 12, వైయస్సార్సీపి 28, ఇతరులు 4 మొత్తం 51 మంది అభ్యర్థులు నామినేషన్లను సంబంధిత అధికారులకు అందజేశారు. అలాగే ఎంపీటీసీలకు సంబంధించి బుచ్చినాయుడు కండ్రిగ 9, బాలయ్య పల్లి 5, చంద్రగిరి 17, చిన్నగొట్టిగల్లు 10, చిట్టమూరు 23, చిట్వేలు 12, దక్కలి 8, దొరవారి సత్రం 5, కె.వి పురం 7, కోడూరు 37, నాగలాపురం 12, నాయుడుపేట 0, నారాయణవనం 4, ఓబులవారిపల్లి 25, ఓజలి 13, పాకాల 14, పెళ్లకూరు 10, పెనగలూరు 17, పిచ్చాటూరు 5, పుల్లంపేట 18, పుత్తూరు 3, రామచంద్రాపురం 10, రేణిగుంట 2, సత్యవేడు 7, శ్రీకాళహస్తి 33, సూళ్లూరుపేట 2, తడ 15, తొట్టంబేడు 20, తిరుపతి రూరల్ 44, వడమాల పేట 14, వాకాడు 14, వరదయ్యపాలెం 15, వెంకటగిరి 2, ఏర్పేడు 14, ఎర్ర వారి పాలెం 6, మొత్తం మీద 452 మంది అభ్యర్థులు ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లను వేసినట్లు సంబంధిత ఎన్నికల అధికారులు తెలిపారు.

## శ్రీకాళహస్తి ఎంపిటిసి ఎన్నికల

# నామినేషన్ల దాఖలులో ఉద్రిక్తత

### -రోడ్డుపై బైఠాయించిన వైకాపా నేతలు



శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 21 ప్రభాతవార్త:

మండలంలోని 15 ఎంపిటిసి స్థానాలు నామినేషన్ల ప్రక్రియ మొదటి రోజు ఉద్రిక్తత వాతావరణంలో సాగింది. ఉదయం నుంచి నామినేషన్లు దాఖలు చేసే మండల కేంద్రం వద్ద రాజకీయ పార్టీల ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు మొహరించారు. గత ఎన్నికల్లో వైకాపా అనుసరించిన విధానాలకు రిటర్న్ గిఫ్ట్ ఇవ్వాలని తెలుగుదేశం తమ్ముళ్ళు నిర్ణయించుకున్నట్లు బుధవారం జరిగిన సంఘటనలు స్పష్టం చేశాయి. బుధవారం వైకాపా నాయకులను నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారని ఆ పార్టీ నాయకులు గగ్గోలు పెట్టగా, ఆ పరిసర ప్రాంతాల్లో పరిస్థితులు ఉద్రిక్తతంగా మారాయి. నామినేషన్ల కేంద్రం వద్దకు వైకాపాకు చెందిన తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దెల గురుమూర్తి, ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి రావటంతో పరిస్థితి ఉద్రిక్తతకు దారి తీసింది. స్థానిక ఎన్నికలన్ని ఏకగ్రీవాలు కావాలని అధికార కూటమి, ఏ ఒక్క చోట కూడా నామినేషన్ వేయకుండా ఉండకూదదని ప్రతిపక్ష వైకాపా నాయకుడు ఆదేశిస్తుండంటతో స్థానికంగా ఉద్రిక్తలకు దారి తీసింది.



**వైకాపా నామినేషన్‌కు రాగా అడ్డుకున్న దేశం తమ్ముళ్ళు:**

ఉదయం పది గంటల ప్రాంతంలో వైకాపా ఎంపిటిసి అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయడానికి వచ్చిన అక్కూర్తికి చెందిన మాజీ ఎంపిటిసి ప్రభాకర్, హరినాథ్‌రెడ్డిలు అక్కడ చేరుకోగా తెలుగుదేశం కార్యకర్తలు వారిని అడ్డగించి వారి నుండి నామినేషన్ పత్రాలు లాక్కొని చించేసి, అనంతరం వారి బైక్‌కు నిప్పటించారు. రూరల్ సిఐ ఇబ్రహీం అక్కడ చేరుకొని మంటలను అదుపు చేశారు. తరువాత ప్రశాంతంగా జరుగుతున్న తరుణంలో మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో మాజీ శాసనసభ్యులు మధుసూదన్‌రెడ్డి, తిరుపతి ఎంపి గురుమూర్తి, ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యంలు మండల పరిషత్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. వారిని తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు అడ్డుకొని వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి.

**రోడ్డుపై బైఠాయించి వాగ్వివాదం:**

ఓ వైపు వాహనాన్ని తగులబెట్టడం మరో వైపు నామినేషన్ వేయనీయకుండా అడ్డుకోవటంతో ఆగ్రహించిన వైకాపా నాయకులు రోడ్డుకడ్డంగా బైఠాయించారు. పోలీసులకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. న్యాయాన్ని రక్షించాల్సిన పోలీసులు అన్యాయానికి అండగా వ్యవహారించటం దారుణమని ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా వారు డిమాండ్ చేస్తూ ప్రజాస్వామ్యంలో ఇలాంటి సంఘటనలు దారుణమన్నారు. ఎన్నికల కమిషనర్ గుర్తించి నామినేషన్లను జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వేయటానికి అవకాశం కల్పించాలని అంతేకాక ఆన్‌లైన్ ద్వారా నామినేషన్లు వేసే అవకాశం కల్పించాలని డిమాండ్ చేసారు. అనంతరం ఇరుపార్టీలు పోటాపోటీగా ధర్నాలు చేపట్టారు. పోలీసులు జోక్యం చేసుకొని ఇరుపార్టీ నాయకులకు సర్దిచెప్పి వైకాపా నాయకులను తిరిగి పంపించేశారు.

### విధి నిర్వహణలో అమరులైన

## పోలీసు వీరుల త్యాగాలు చిరస్మరణీయం





తిరుపతి,అక్టోబర్ 21(ప్రభాతవార్త):

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని, ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షి ంచేందుకు తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా విధులు నిర్వర్తించిన వారి సేవలు యావత్ సమాజానికి ఆదర్శప్రాయమని తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వెంకటేశ్వర్, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బ రాయుడు పేర్కొన్నారు. ప్రజలకు తొలి స్పందన వ్యవస్థగా పోలీసులు అందిస్తున్న సేవల్ధ అభినందనీ యమని అన్నారు. విధి నిర్వహణలో వీరమరణం పొందిన పోలీసు అధికారుల త్యాగాలను గౌరవించడంతో బాటు, వారి కుటుంబాలకు అవసరమైన ప్రభుత్వ సహాయ సహకారాలు అందించేందుకు తన వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని హామీ ఇచ్చారు. జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు మాట్లాడుతూ ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణ కోసం విధి నిర్వహణలో తమ ప్రాణాలను సైతం త్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరుల త్యాగాలు ప్రతి పోలీసు అధికారి, సిబ్బందిలో బాధ్యతను, ధైర్యాన్ని, సేవాభావాన్ని మరింత పెంపొందిస్తాయని అన్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం.జయకృష్ణ,అదనపు ఎస్పీలు శ్రీనివాసులు,రవి మనోహరాచారి, ఐ రామకృష్ణ ,పోలీస్ అధికారులు పోలీస్ అమరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## జడ్పీటిసీ ఎన్నికల నామినేషన్లలో ఉద్రిక్తత

చిత్తూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

జిల్లాలో 27 జడ్పీటిసీ స్థానాలకు ఎన్నికలు జరుగుతుంది. ఈ మేరకు జడ్పీటిసీ అభ్యర్థులుగా పోటీ చేసే వారు జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రంకు వచ్చిన తమ నామినేషన్లు దాఖలు చేయాల్సి వుంది. నామినేషన్ల దాఖలు మొదటి రోజైన బుధవారం అభ్యర్థులు 18 నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ జడ్పీటిసీ అభ్యర్థులుగా 7 మంది నామినేషన్లు దాఖలు చేయగా, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులుగా 6 మంది నామినేషన్లు దాఖలు చేశారు. జనసేన పార్టీ తరపున జడ్పీటిసీలుగా పోటీ చేయడానికి ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయగా, కాంగ్రెస్ పార్టీ నుండి ఒక అభ్యర్థి, స్వతంత్ర్య అభ్యర్థిగా ఒకరు జడ్పీటిసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేశారు.

# కలెక్టరేట్ వద్ద తీవ్ర ఉద్రిక్తత

### చెవిరెడ్డి, పులివర్తి నానితో పాటు పలువురు నేతలు అరెస్టు... విడుదల



తిరుపతి కలెక్టరేట్, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

తిరుపతి జిల్లా కలెక్టరేట్ లో స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా బుధవారం ఎంపీటీసీ, జడ్పిటిసి నామినేషన్ల పర్వం తీవ్ర ఉద్రిక్తత మధ్య కొనసాగింది. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఎక్కడికక్కడ కూటమి పార్టీలకు సంబంధించిన నేతలు అడ్డుకొని, నామినేషన్ల పత్రాలను లాక్కోవడం, చించి వేయడం, భౌతికంగా దాడి చేసే రక్త గాయాలు చేయడంతో చంద్రగిరి నియోజకవర్గంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎంపీటీసీ, జడ్పిటిసి స్థానాలకు నామినేషన్లు వెయ్యడానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు నామినేషన్ కేంద్రాలకు వెళితే కూటమి పార్టీల నాయకులు భౌతికంగా దాడి చేసి తలలు పగలగొట్టారని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తిరుపతి జిల్లా కలెక్టరేట్ వద్ద నిరసనకు దిగారు. వందల మంది వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, అభ్యర్థులతో చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఆయన సతీమణి లక్ష్మి, చంద్రగిరి నియోజకవర్గ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి, విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు వందల సంఖ్యలో కలెక్టరేట్ లోనే బైఠాయించారు. దీంతో జిల్లా కలెక్టరేట్లో ఆందోళన వాతావరణం నెలకొంది. జిల్లా కలెక్టర్ స్వయంగా వచ్చి జిల్లా ఎన్నికల అధికారి హోదాలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు పూర్తి రక్షణ కల్పిస్తూ నామినేషన్లు వేయించాలని, అప్పటివరకు ఇక్కడి నుండి కదిలే ప్రసక్తే లేదని చెవిరెడ్డి చెప్పారు. ఇది ఇలా ఉండగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన ఎంపీటీసీ, జడ్పిటిసి అభ్యర్థులపై చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుట్రపూరితంగా దాడి చేయించుకుని ఆ నిందలను మాపై మోపుతున్నారంటూ చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని నాయకులతో కలిసి జిల్లా కలెక్టరేట్ కు చేరుకుని కలెక్టరేట్ గేటు వద్ద బైఠాయించి నినాదాలు చేశారు. పులివర్తి నాని కలెక్టరేట్ వద్ద నిరసన ధర్నాకు దిగారన్న సమాచారంతో తెలుగుదేశం పార్టీ నాయకులు పెద్ద ఎత్తున అక్కడికి చేరుకోవడానికి ప్రయత్నం చేశారు. ఇంతలోనే పోలీసులు పులివర్తి నానిని అరెస్టు చేసి తరలించారు. ఎమ్మెల్యే పులివర్తి నానిని అరెస్టు చేసిన అర్ధగంట తరువాత జిల్లా కలెక్టరేట్లో ఉన్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులను వందల మంది పోలీసులు అరెస్టు చేసి తిరుచానూరు పోలీస్ స్టేషన్ కు తరలించారు.

# ఏం జరుగనుందో..!?

## ఉమ్మడి చిత్తూరు జిల్లా కూటమిలో మున్సిపల్ ఎన్నికల ఆందోళన!

## -మున్సిపల్ ఎన్నికలకు బ్రేక్ !!

ప్రభాతవార్త-తిరుపతి:



ఎట్టకేలకు ఉమ్మడిచిత్తూరుజిల్లాలో మున్సిపల్, మున్సిపల్ కార్పొరేషన్‌ల స్థానిక ఎన్నికలకు బ్రేక్ వేస్తూ ఎస్ఇసి కీలక నిర్ణయం వెలువడించింది. తదుపరి ఎన్నికల ప్రక్రియపై నేడు సంచలన ప్రకటన వెలువడయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే నామినేషన్లు దాఖలు చేయడం, కొన్నిచోట్ల అభ్యర్థులు ఏకగ్రీవాలు వంటి అంశాలపై కూడా ఎస్ఇసి ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీల నివేదికల ఆధారంగా చర్యలు తీసుకోనుందని తెలుస్తోంది. ఇప్పుడు తిరుపతితోబాటు ఉమ్మడి చిత్తూరుజిల్లాలో నగరపాలక ‘సంస్థలకు,మున్సిపాల్టీలకు జరగాల్సిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ తాత్కాలికంగా బ్రేక్ పడటంతో రాజకీయంగా కూటమి పార్టీల నేతల్లో ఆందోళన ప్రారంభమైంది. మరోవైపు నామినేషన్ల దాఖలులో తమకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తున్న వైసిపి నేతల్లో తాజా పరిణామాలు ఉత్సాహాన్ని నింపాయి. దీంతో ఇప్పుడు మున్సిపల్, కార్పొరేషన్ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఎన్నికల షెడ్యూల్ ప్రకారం బుధవారం సాయంత్రానికి పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితా ప్రకటించాల్సి ఉంది. ఇప్పటికే పోటీ చేయనున్న వివిధ పార్టీల అభ్యర్థులు బి ఫారాలు సమర్పించారు. అయితే, నామినేషన్ల దాఖలు సమయంలో తమ పార్టీ అభ్యర్థులను అడ్డుకున్నారంటూ వైసిపి చేసిన ఫిర్యాదులపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. ఈ ఫిర్యాదులను పరిశీలించి గురువారంలోగా నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర ఎన్నికల సంఘాన్ని ఆదేశించింది. అక్టోబర్ 25 వరకు తుది అభ్యర్థుల జాబితాను ప్రచురించవద్దని సూచించడంతోబాటు ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు తగిన భద్రత కల్పించాలని రాష్ట్ర డిజిపిని ఆదేశించింది. రాత్రి వరకు తిరుపతి కార్పొరేషన్‌కే స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియపై ఈ ఆదేశాల ప్రభావం పడిందని అనుకున్నా రాత్రి 11గంటలకు ఎస్ఇసి కీలక నిర్ణయంతో ఉమ్మడి చిత్తూరుజిల్లాలోని అన్ని మున్సిపాల్టీల ఎన్నికలకు బ్రేక్ పడింది. నామినేషన్లపై వచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, ఎన్నికల ప్రక్రియ న్యాయబద్ధంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో మళ్ళీ తొలినుండి ప్రక్రియ మొదలయ్యే సూచనలు ఉన్నాయి.

**తిరుపతిలో నామినేషన్ల వివాదం**

:తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ పదవికి టిడిపి అభ్యర్థిగా జె.బి. శ్రీనివాస్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే 66 కార్పొరేటర్ స్థానాలకు కూటమి అభ్యర్థులు నామినేషన్లు వేశారు. మరోవైపు వైసిపి మేయర్ అభ్యర్థి వై. వాసు యాదవ్ రెండో రోజు నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్లినప్పుడు టిడిపి కార్యకర్తలు అడ్డుకున్నారని ఆరోపణలు వినిపించాయి. మూడో రోజు ఆయన ఒంటరిగా వెళ్లి కార్పొరేషన్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం, ఇతరులతో కలిసి మరో సెట్ నామినేషన్‌ను కూడా సజావుగా సమర్పించారు. ఇక 66 కార్పొరేటర్ స్థానాల్లో 21 చోట్ల వైసిపి అభ్యర్థులు నామినేషన్లు వేయలేకపోయారని, సుమారు 45 స్థానాల్లో మాత్రమే నామినేషన్లు దాఖలు చేశారని సమాచారం. నామినేషన్లు వేసిన తమ అభ్యర్థులను భయపెట్టి ఉపసంహరణకు ఒత్తిడి చేస్తున్నారని వైసిపి నేతలు ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల నేపథ్యంలో సుప్రీంకోర్టు ఆదేశాలు రాష్ట్ర ఎన్నికల సంఘం తదుపరి నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది.

**-కూటమి నేతల్లో అంతర్మథనం:**

తాజా పరిణామాలతో తిరుపతిలో కూటమి నేతల్లో కొంత నిరాశ కనిపిస్తుండగా, వైసిపి నాయకులు తమకు రాజకీయంగా అవకాశం పెరుగుతుందని భావిస్తున్నారు. కొందరు టిడిపి సీనియర్ నాయకులు ఈ పరిణామాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. నామినేషన్ల వివాదం కారణంగా పార్టీ ప్రతిష్ఠ దెబ్బతిన్నదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.అయితే, నామినేషన్లపై వచ్చిన ఫిర్యాదులను రాష్ట్ర ఎన్నికల సంఘం ఎలా పరిశీలిస్తుంది? గడువు పొడిగింపుపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటుంది? తుది అభ్యర్థుల జాబితా ఎప్పుడు ప్రకటిస్తుంది అనే అంశాలపై తిరుపతి మేయర్ ఎన్నికల భవిష్యత్తు ఆధారపడి ఉంది. ఎన్నికల ప్రక్రియలో తదుపరి పరిణామాలు కూటమి, వైసిపి రాజకీయ వ్యూహాలపై ప్రభావం చూపే అవకాశం ఉందనేది కూడా నగరవాసుల్లో చర్చ మొదలైంది. ఇదేగాక ఇప్పటికే కూటమిలో టిడిపి తరపున ఆశావహులు కూడా కార్పొరేటర్లుగా నామినేషన్లు వేసినా బి ఫారాలుఅందక అంతర్మథనంవ్యక్తం చేస్తున్నారు.

# కోడూరు కూటమిలో కుదరని సయోధ్య

### బగ్గుమన్న బత్యాల వర్గం.. జనసేన నాయకుడికి దేహశుద్ధి.

### వైసిపినాయకులకు పోలీస్‌లతో చుక్కదురు.. 17.నామినేషన్లు. ఒకటి వైసీపీ.



రైల్వే కోడూరు, అక్టోబర్, 21(ప్రభాత వార్త )

కోడూరు మండలంలో ఎంపిటిసిల నామినేషన్ల దాకల వ్యవహారం ఉదయం నుంచి సాయంత్రం 5గంటల వరకు రభసల మద్యే జరిగింది. ఒక వైపు ఎన్.డి.ఏ. కూటమి నాయకులు టి.డి.పి. జనసేనల నాయకులు వారి వారి అభ్యర్థులతో నామినేషన్లు వేస్తున్నారు. ఇదే ప్రక్రియలో వైసీపీ పార్టీకి చెందిన నాయకులు మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనువాసులు, మాజీ వైస్ ఎం.పి.పి. ధ్వజా రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ తోట శివసాయిలు తమ పార్టీ అభ్యర్థులు తో నామినేషన్లు వేసేందుకు కార్యాలయం వద్దకు బారీ జన సమూహం తో చేరుకున్నారు. అయితే వారిని నామినేషన్ వేసేందుకు పోలీస్ లు అనుమతించలేదు. వైసీపీ అభ్యర్థులు మీ కాళ్ళు పట్టుకుంటాం మమ్ముల్ని నామినేషన్లు వేయించండి సారు అంటూ పోలీస్‌ల కాళ్ళు పట్టుకొని బ్రతిమ లాడిన కనికరించలేదు. దీంతో ఆ పార్టీ నాయకులు కు పోలీస్ లతో చుక్కఎదురైంది. చేసేదేమి లేక వైసీపీ నాయకులు అభ్యర్థులు, కార్యకర్తలు ధర్నా కు దిగి రోడ్డుపై గంటల తరబడి బైఠాయించారు. దీంతో పోలీస్‌లకు తలనొప్పిగా మారింది. దీనినివిరమింపజేసేందుకు సిఐ వేయిస్తానని బ్రతిమలాడి బైఠాయింపు ధర్నా ను విరమింప జేశారు. మధ్యాహ్నం పైన వైసీపీ అభ్యర్థులు ఇద్దరు నామినేషన్లు వేసేందుకు వెళితే ఒక నామినేషన్ వేయించి రెండవ నామినేషన్ ను చించి పడేశారు. వీరి పరిస్థితి ఇలా ఉంటే కూటమి నాయకులు మధ్య జరిగిన వ్యవహారం తీవ్ర స్థాయిలో గొడవలు జరిగాయి. దీంతో ఎన్నికల అధికారులు కూడా బాయాందోళనకు గుర్రైయ్యారు. ఈ గొడవల వ్యవహారం చూస్తే కూటమి నాయకులు మధ్య సయోధ్య బాగా చెదిరి నాయకులు మధ్య అంతర్గతంగా ఉన్న విబేధాలు నామినేషన్ల కేంద్రంలో ఒక్క సారిగా బగ్గుమన్నాయి.బత్యాల చంగల్రాయులు అన్న కుమారుడు నాగరాజు నామినేషన్ వేసేందుకు వెళ్లగా అప్పటికే అక్కడ ఉన్న జనసేన పార్టీలో ప్రముఖ పాత్ర పోషిస్తున్న నియోజకవర్గం నాయకుడు తన అనుచరులు తో కలిసి నాగరాజు చేతిలో ఉన్న నామినేషన్ పత్రాలను లాక్కొని అతనిపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న బత్యాల వర్గం వారి అవేశాన్ని పోలీస్‌లు కూడా అదుపు చేయలేని పరిస్థితి జనసేన ప్రముఖ నాయకుడికి బత్యాల వర్గీయులు బాగా దేహశుద్ధి చేసి బుద్ధి చెప్పారు. కోడూరులో తొలిరోజు నామినేషన్ వైసీపీకి చుక్కదురైతే పోలీస్‌లకు తలనొప్పి, జనసేన నాయకుల గుండెలో భయం గుబులు పుట్టింది.

# కుప్పం మున్సిపల్ చైర్మన్ బరిలో ఆరుమంది

## - 13 ఏకగ్రీవ వార్డులు తెదేపా కైవశం.. 19 వార్డుల్లో పోటీ !!



కుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త

కుప్పం మున్సిపల్ చైర్మన్ ఎన్నికల బరిలో 6మంది అభ్యర్థులు మిగిలారు. చైర్మన్ అభ్యర్థులుగా రాజ్‌కుమార్ (తెదేపా), బత్తలపల్లి విజయ్‌కుమార్ (వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ), సి. గణేష్ (బహుజన సమాజ్ పార్టీ), పళని (భారత జాతీయ కాంగ్రెస్), వైకాపా తరపున బిఫామ్ అందని నాగరాజు, మమత స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నారు. తెదేపా నుంచి నామినేషన్లు దాఖలు చేసిన డాక్టర్ వెంకటేష్, బాబు, మురుగన్, వైకాపా తరపున నామినేషన్ వేసిన మురుగన్ తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. కాగా బుధవారం ఎన్నికల అధికారి శ్రీనివాసులు రాజు, ఎఆర్వో, కమీషనర్ శ్రీనివాసరావు మున్సిపల్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రంలో నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియను నిర్వహించారు. ఈసందర్భంగా కుప్పం మున్సిపల్ పరిధిలోని 13 వార్డులైన 5,6,13,18,19,20,22,23,24,25,26,28, 30వార్డుల్లో వైకాపా అభ్యర్థులతో పాటు తెదేపా తరపున బి.ఫామ్ ఆశించిన అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 5వ వార్డు అరుణ్‌కుమార్, 6వ వార్డు సింగారవేలు, 13వ వార్డు టికె సోమశేఖర్, 18వ వార్డు నందిని మునస్వామి, 19వ వార్డు శిరీష ముఖేష్‌కుమార్, 20వ వార్డు కృష్ణన్, 22వ వార్డు అశ్విని మంజునాథ్, 23వ వార్డు సుల్తానా జాకీర్, 24వ వార్డు శోభ సుబ్రమణ్యం, 25వ వార్డు దామోదరం, 26వ వార్డు సోమశేఖర్, 28వ వార్డు భారతి చంద్రశేఖర్, 30వ వార్డు లావణ్య సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈనెల 28న మిగతా 19 వార్డుల్లో కౌన్సిలర్, చైర్మన్ ఎన్నికలు జరగనున్నాయి.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## ఎంపిటిసీ స్థానాలకు 12 నామినేషన్లు

బంగారుపాళ్యం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

బంగారుపాళ్యం మండల పరిధిలోని 21 ఎంపిటిసీ స్థానాలకు 12 స్థానాలకు మాత్రమే మొదటి రోజు నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో బంగారుపాళ్యం-1 ఎంపిటిసీ స్థానంకు 2, బంగారుపాళ్యం-స్థానంకు 2, కీరమందకు 2, నల్లంగాడు 1, రాగిమానుపెంట 2, సంక్రాంతిపల్లి 1, టేకుమంద 1, తగ్గువారిపల్లి-1కు 1, తగ్గువారిపల్లి-2కు 1, తంబుగానిపల్లి 2, తుంబకుప్పం 2, తుంబకు 2 నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారిణి లక్ష్మీ తెలిపారు. మండల పరిధిలో 21 ఎంపిటిసీ స్థానాలు వుండగా 12 ఎంపిటిసీ స్థానాలకు మాత్రమే నామినేషన్లు దాఖలైనట్లు ఆమె పేర్కొన్నారు. దాఖలైన 19 నామినేషన్లలో టిడిపి 17, జనసేన 2 వున్నట్లు తెలిపారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నుండి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదన్నారు. డిఎస్పీ మహబూబ్ భాషా, ఇన్స్‌పెక్టర్ కత్తి శ్రీనివాసులు, ఇతర పోలీసు సిబ్బంది కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

## 9 ఎంపిటిసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు



శ్రీరంగరాజపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

ఎంపిటిసీ ఎన్నికల నామినేషన్ల దాఖలు మొదటి రోజు బుధవారం 9 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఎస్ఆర్ పురం మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపిటిసీ అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రారంభమైంది. తెలుగుదేశం పార్టీ తరపున 8 మంది అభ్యర్థులు, జనసేన పార్టీ తరపున ఒక అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ ఆఫీసర్ ఉమామహేశ్వరీ పేర్కొన్నారు. నామినేషన్ల దాఖలు తీరును బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుషార్ డూడిలు పరిశీలించి ప్రశాంత వాతావరణంలో నామినేషన్ల ప్రక్రియ నిర్వహించేలా పక్కా ఏర్పాట్లు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

## కుప్పం మున్సిపల్ ఎన్నికల్లో 13 వార్డులు ఏకగ్రీవం

### - తెదేపా అభ్యర్థులు ఏకగ్రీవ ఎన్నిక .. ధృవీకరణపత్రాల అందజేత !!



కుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త

రాష్ట్రంలోనే ప్రతిష్టాత్మకమైన కుప్పం మున్సిపాలిటీకి సంబంధించి జరుగుతున్న ఎన్నికల్లో అధికార తెలుగుదేశం పార్టీ సత్తా చాటింది. బుధవారం నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమంను ఎన్నికల అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా 13 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఈ వార్డులన్నీ తెలుగుదేశం పార్టీ అభ్యర్థులు కైవశం చేసుకున్నారు. దీంతో ఎన్నికల అధికారులు 13వార్డుల కౌన్సిలర్లకు అధికారికంగా ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఏకగ్రీవంగా కౌన్సిలర్లుగా ఎన్నికైన వారిలో 5వ వార్డు అరుణ్‌కుమార్, 6వ వార్డు సింగారవేలు, 13వ వార్డు టికె సోమశేఖర్, 18వ వార్డు నందిని మునస్వామి, 19వ వార్డు శిరీష ముఖేష్‌కుమార్, 20వ వార్డు కృష్ణన్, 22వ వార్డు అశ్విని మంజునాథ్, 23వ వార్డు సుల్తానా జాకీర్, 24వ వార్డు శోభ సుబ్రమణ్యం, 25వ వార్డు దామోదరం, 26వ వార్డు సోమశేఖర్, 28వ వార్డు భారతి చంద్రశేఖర్, 30వ వార్డు లావణ్య సురేష్ ఉన్నారు. కాగా కుప్పం మున్సిపల్ ఛైర్మన్ ఎన్నికల బరిలో 6మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. రాజ్‌కుమార్ (తెదేపా), బత్తలపల్లి విజయ్‌కుమార్ (వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ), సి. గణేష్ (బహుజన సమాజ్ పార్టీ), పళని (భారత జాతీయ కాంగ్రెస్), వైకాపా తరపున బిఫామ్ అందని నాగరాజు, మమత స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో ఉన్నారు.

## ప్రజలు తెదేపాకు ఏకపక్షంగా ఓట్లేస్తారు

### - ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం



కుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త

జరగనున్న కుప్పం మున్సిపల్, పరిషత్, పంచాయతీ ఎన్నికల్లో ప్రజలు తెలుగుదేశం పార్టీకి ఏకపక్షంగా ఓట్లేసి గెలిపిస్తారని ఆర్టీసీ వైస్‌చైర్మన్ పిఎస్ మునిరత్నం పేర్కొన్నారు. బుధవారం స్థానిక తెదేపా కార్యాలయంలో ప్రభుత్వవిప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, సిఎం పిఎ శ్రీకాంత్, రెస్కో ఛైర్మన్ ప్రతాప్‌కుమార్, మున్సిపల్ ఛైర్మన్ అభ్యర్థి రాజ్‌కుమార్ తదితరులతో కలసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కుప్పం చరిత్రలో బుధవారం మరువలేని రోజు అన్నారు. కుప్పం మున్సిపాలిటీలో తెదేపాకు 13 వార్డులు ఏకగ్రీవం కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో శాంతియుతంగా ఎన్నికలు జరగాలని సూచించారని అందుకు తగినట్లుగానే తామెక్కడా గతంలో వైసిపి లాగా దౌర్జన్యాలు చేయలేదన్నారు. ఈ ఎన్నికల్లో అభ్యర్థులను సిఎం చంద్రబాబే నిర్ణయిస్తున్నారన్నారు. అన్నివర్గాల వారికి సమాన అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. కుప్పంలో కూటమి పార్టీలైన బిజెపి, జనసేనలు సైతం తమకు సహకరిస్తున్నాయన్నారు. కుప్పంలో సిఎం నమ్మకాన్ని తాము వమ్ము చేయమన్నారు. కుప్పాన్ని ఓ ఆదర్శ నియోజకవర్గంగా మలచడమే సిఎం చంద్రబాబు లక్ష్యం అన్నారు. కుప్పంలో విజయం తర్వాత విజయవాడలో శ్రీ కనకదుర్గమ్మ గుడి నుంచి పాదయాత్రగా సిఎం స్వగృహం దాకా ర్యాలీ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో టిడిపి మున్సిపల్ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లు, బిజెపి ఇన్‌చార్జ్ తులసినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు మేయర్ కుర్చీ బరిలో 6 మంది అభ్యర్థులు

చిత్తూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

చిత్తూరు నగర మేయర్ ఎన్నికల బరిలో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 6 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా ఆర్.చంద్రశేఖర్, తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా కఠారి హేమలత, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పి.పూర్ణచంద్రశేఖర్, స్వతంత్ర్య అభ్యర్థులుగా జి.కుమారవేల్, పి.చందర్‌శేఖర్, ఆర్.శశికుమార్‌లు పోటీలో నిలిచారు. చిత్తూరు మేయర్ కుర్చీ కోసం దక్కించుకోవడం కోసం అభ్యర్థులు పెద్ద ఎత్తున నామినేషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలో నామినేషన్ల పరిశీలనలో కొందరి నామినేషన్లు తిరస్కరణకు గురి కాగా, బుధవారం నామినేషన్ల ఉపసంహరణ కార్యక్రమం పూర్తి కావడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.పుల్లారెడ్డి మేయర్ కుర్చీ బరిలో వున్న అభ్యర్థుల పేర్లను విడుదల చేశారు. ఈ మేరకు మేయర్ ఎన్నికలు ఈ నెల 28వ తేదీన జరుగనున్నాయని రిటర్నింగ్ అధికారి పుల్లారెడ్డి పేర్కొన్నారు.

## గంగాధర నెల్లూరులో 8 నామినేషన్లు దాఖలు

గంగాధర నెల్లూరు అక్టోబరు 21 ప్రభాతవార్త:



గంగాధర నెల్లూరు మండలంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో మొదటి రోజైన బుధవారం 8 నామినేషన్లు దాఖలైనట్లు దీనిలో వైసిపి ఒకటి టిడిపి 7 నమోదయాయక్నారు. రెండవ రోజు భారీగా నామినేషన్లు నమోదయ్యో అవకాశం వుందని నాయకులు తెలిపారు. అయితే వైసిపి వర్గం అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేయడానికి కార్యాలయానికి ప్రవేశింయడానికి ముందే పోలీసుల సమక్షంలోనే పాలకపక్ష నాయకులు దౌర్జన్యంగా లాక్కొని చించి వేసి చేయి చేయి చేసుకుంటున్నారని పోలీసులకు ఫిర్యాదు చేసిన తమకు న్యాయం జరగడం లేదని మండల పార్టీ అధ్యక్షుడు వెంకట రెడ్డి అధ్యక్షతన పోలీసులతో విగ్వివాదానికి దిగిన లాభం లేకపోయిందని వచ్చినవారు ఎమి చేయాలో తోచక తిరిగి వెళ్ళిపోతున్నారని ఇది ప్రజాస్వామికమని వారు నిజంగా అభివృద్ధి చేసే వుంటే పోటీ చేసి గెలుపు సాధించాలని కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలను ప్రజలు గమనిస్తున్నారుని వారు వాపోయారు రిటర్నింగ్ అధికారితో పాటు తహసాల్దార్ శ్రీనివాసులు పాల్గొనగా సిఐ కృష్ణమోహన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## ఎంపిటిసిలకు తొలిరోజు 50 నామినేషన్లు

కుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త



కుప్పం మండలంలోని 21 ఎంపిటిసి సెగ్మెంట్లకు సంబంధించి బుధవారం స్థానిక మండల కార్యాలయంలో నామినేషన్ల ప్రక్రియ మొదలైంది. ఆర్వో నరసింహనాయుడు, ఎఆర్వో రాజేంద్ర ప్రసాద్‌ల నేతృత్వంలో నామినేషన్ల సీ ్వకరణకు ఏర్పాట్లు చేపట్టారు. ఆయా సెగ్మెంట్లకు సంబంధించి తొలిరోజు యాభై నామినేషన్లు దాఖలయ్యాయి. వీటిలో తెదేపా తరపున 12, వైకాపా తరపున 37, బిజెపి తరపున 1 నామినేషన్ వేశారు. ఈనెల 23వతేది సాయంత్రం 5గంటలతో నామినేషన్ల దాఖలుకు గడువు ముగియనుంది. నామినేషన్ దాఖలు కేంద్రాన్ని ఎస్పీ బి. హేమంత్ పరిశీలించి భద్రత ఏర్పాట్లు పర్యవేక్షించారు. అర్బన్ సిఐ జిటి నాయుడు సిబ్బందితో గట్టి బందోబస్తు చేపట్టారు. తొలిరోజు నామినేషన్ల దాఖలు ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

## ఎంపిటిసీ స్థానాలకు 12 నామినేషన్లు

పెనుమూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

పెనుమూరు మండలంలో ఎంపిటిసీ స్థానాలకు నామినేషన్ల దాఖలకు మొదటి రోజైన బుధవారం 12 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో తెలుగుదేశం పార్టీ తరపున 8 మంది అభ్యర్థులు ఎంపిటిసీ స్థానాలకు నామినేషన్లు దాఖలు చేయగా, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరపున నలుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. నామినేషన్ కేంద్రంలో ఎన్నికల అధికారి వెంకట సునీల్ అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరించగా, చిత్తూరు ఈస్ట్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ రామచంద్ర ఆధ్వర్యంలో ఎస్ఐ శ్రీకాంత్ గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

## మణికంఠేశ్వరునికి ఘనంగా గ్రామోత్సవం

కాణిపాకం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీమరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయంలో స్వామివారికి విజయదశమి సందర్భంగా మంగళవారం రాత్రి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు. మణికంఠేశ్వరాలయంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మంగళవారం అమ్మవారికి మహిషాసుర మర్ధిని అలంకారం, శమిపూజ, గ్రామోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించారు. అలాగే స్వామివారికి వేరుగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈమేరకు ఉభయదారులు వరుస ఉభయం తీసుకురాగా ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకపూజలు చేశారు. అలాగే రాత్రి అలంకరించిన స్వామివారిని ప్రత్యేకపల్లకిపై వుంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామ పురవీధుల గుండా ఘనంగా ఊరేగించారు. ఆకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, ఉత్సవ ఉభయదారులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## కూటమి ఎంపీపీ అభ్యర్థిగా సుభావతి నామినేషన్

### తొలిరోజు రెండు నామినేషన్లు దాఖలు



గంగవరం, అక్టోబరు 21, ప్రభాతవార్త :

గంగవరం మండలం ఎంపీపీ అభ్యర్థిగా కూటమి పార్టీ తరుపున కలగటూరు పంచా యతీ అరసనపల్లె గ్రామానికి చెందిన మాజీ జడ్పీటీసీ, ప్రస్తుత తెలుగుదేశం పార్టీ మండలా ధ్యక్షులు సోమశేఖర్‌గౌడు సతీమణి సుభావతి నామినేషన్ దాఖలు చేశారు. కలగటూరు, తాళ్ళపల్లె పంచాయతీల ఎంపీటీసీ సెగ్మెంట్ స్థానానికి బుధవారం సాయంత్రం ఆమె నామినేషన్ దాఖలు చేశారు. అలాగే కీలపట్ల పంచాయతీ కురపల్లె గ్రామానికి చెందిన హేమగిరి భార్య కళావతి కీలపట్ల ఎంపీటీసీ అభ్యర్థిగా టిడిపి తరుపున నామినేషన్ దాఖలు చేసినట్లు చేశారు. మొదటిరోజు రెండు నామినేషన్లు దాఖలు అయినట్లు ఎన్నికల అధికారి జి.సతీష్ తెలిపారు.

## శాంతిపురంలో ఎంపిటిసిలకు 20నామినేషన్లు

శాంతిపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త



శాంతిపురం మండలంలోని 18 ఎంపిటిసి సెగ్మెంట్లకు సంబంధించి స్థానిక మండల సచివాలయంలో బుధవారం నామినేషన్లు స్వీకరించారు. ఆర్వో రబ్బాని బాషా, ఎఆర్వో ఎపిఆర్ కుమార్‌ల నేతృత్వంలో మండల సచివాలయంలో నామినేషన్ల స్వీకరణ ఏర్పాటు చేయగా తొలిరోజు 20 నామినేషన్లు దాఖలయ్యాయి. కడపల్లి 3, దండికుప్పం 2, అనికెర, కొల మడుగు, కెనమాకులపల్లి, చెంగుబళ్ల, ఎంకెపురం, మఠం, 121 పెద్దూరు, 64 పెద్దూరు, కర్లగట్ట, అబకలదొడ్డి, శివరాంపురం, మొరసనపల్లి, రాళ్లబూదుగూరు సెగ్మెంట్ల లో ఒక్కో నామినేషన్ దాఖలైంది. గుంజార్లపల్లి, బండపల్లి సెగ్మెంట్లకు తొలిరోజు నామినేషన్లు వేయలేదు.

## దిగువమాఘంలో ఘనంగా రాజన్న వర్ధంతి వేడుకలు



తవణంపల్లె, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

రాష్ట్ర మాజీ మంత్రి గల్లా అరుణకుమారి తండ్రి, మాజీ ఎంపీ దివంగత పాటూరి రాజగోపాల్ నాయుడు (రాజన్న) 29వ వర్ధంతి వేడుకలను మంగళవారం ఆయన స్వ గ్రామమైన దిగువమాఘంలో అత్యంత ఘనంగా నిర్వహించారు. దిగువమాఘంలోని రాజన్న మెమోరియల్ పార్క్‌లో వర్ధంతి వేడుకలను నిర్వహించారు. ఈసందర్భంగా రాజగోపాల్‌నాయుడు కుమార్తె మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, అమరరాజా వ్యవస్థాపక ఛైర్మన్ గల్లా రామచంద్రనాయుడు దంపతులు, అమర హాస్పిటల్స్ ఎండీ డాక్టర్ రమాదేవిలు రాజన్న పార్క్‌లోని రాజగోపాల్‌నాయుడు కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ పేదల పక్షపాతి రాజగోపాల్‌నాయుడు అని కొనియాడారు. మండల ఈకార్యక్రమంలో దిగువమాఘం సర్పంచ్ గోపీ, మాజీ సర్పంచ్ కుమార్‌నాయుడు, రాజన్న ఫౌండేషన్ నిర్వాహకులు సతీష్ రాళ్ళపల్లి, మాజీసర్పంచ్‌లు కుమర్‌నాయుడు, గోపీ, పరందామనాయుడు, బంగారుపాళ్యం ఏఎంసీ ఛైర్మన్ భాస్కర్‌నాయుడు, గ్రామస్థులు, గల్లా అభిమానులు పాల్గొన్నారు.

## జడ్పీటిసి అభ్యర్థిగా కేశవరాజు నామినేషన్



శాంతిపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త

శాంతిపురం మండల ంకు చెందిన కాంగ్రెస్ పార్టీ నేత కేశవరాజు శాంతిపురం మండల కాంగ్రెస్ పార్టీ జడ్పీటిసి అభ్యర్థిగా బుధవారం చిత్తూరులో నామినేషన్ దాఖలు చేశారు.

## మహిళ హత్య కేసులో ఇద్దరు అరెస్ట్ - ఎఎస్పీ



గుడుపల్లె, అక్టోబర్ 21 ప్రభాతవార్త

మండలంలోని సోడిగానిపాలెం వద్ద మహిళను హత్యచేసి పూడ్చిపెట్టిన కేసులో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు కుప్పం ఎఎస్పీ బి.హేమంత్ తెలిపారు. తమిళనాడు రాష్ట్రం వేపనపల్లి సమీపంలోని మనార్లపల్లికి చెందిన జ్యోతిక (24)కు గతంలో వివాహమై కొన్నాళ్లకే భర్తతో విడిపోయి కుమారుడితో కలసి తల్లిదండ్రుల వద్ద ఉంటోందన్నా రు. ఈ నేపథ్యంలో కుప్పం మండలం గొల్లపల్లికి చెందిన శేఖర్‌తో పరిచయం ఏర్పడి అతనితో సహజీవన ం కొనసాగించిందన్నారు. ఈనెల 6వతేది జ్యోతికతో జరిగిన గొడవ కారణ ంగా ప్రియుడు శేఖర్ ఆమెను తాడుతో గొంతు బిగించి హతమార్చాడన్నారు. తన అన్న గోవిందరాజులు సాయంతో మృతదేహాన్ని గుడుపల్లె మండలం సోడిగానిపాలెం వద్ద హంద్రీ-నీవా కాలువ సమీపంలో పాతిపెట్టారని విచారణలో తేలిందన్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారినుంచి హత్యకు వాడిన తాడు, మృతదేహంను పాతిపెట్టేందుకు ఉపయోగించిన గడ్డపార, చెనిక, మచ్చుకత్తి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేధించిన రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఎస్సై శ్రీనివాసులు, సిబ్బందిని ఎఎస్పీ అభినందించారు.

## రామకుప్పంలో తొలిరోజు 13 నామినేషన్లు

రామకుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త



రామకుప్పం మండలంలో ఎంపిటిసి ఎన్నికల నామినేషన్ దాఖలు ప్రక్రియ మొదలైంది. ఆర్వో రవికుమార్ నేతృత్వంలో బుధవారం ఉదయం 9గంటలనుంచి సాయంత్రం 5గంటల వరకు అధికారులు అభ్యర్థులనుంచి నామినేషను ్ల స్వీకరించారు. తొలిరోజు కొంగనపల్లి, రామకుప్పం2, బందార్లపల్లి 2, పంద్యాలమడుగు, మణీంద్రం, ముద్దనపల్లి, కెంచనబళ్ల, ఉన్సిగానిపల్లి, విజలాపురం సెగ్మెంట్లకు గాను 13 నామినేషన్లు దాఖలయ్యాయి. కుప్పం ఎఎస్పీ బి. హేమంత్ మండల కార్యాలయం వద్ద పోలీసు భద్రతను పర్యవేక్షించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపిడిఒ అశ్విని, ఇఒ సోమశేఖర్ పాల్గొన్నారు.

## లారీ.. కారు ఢీ.. తప్పిన ప్రమాదం

బైరెడ్డిపల్లి, అక్టోబర్ 21 ప్రభాతవార్త

మండలంలోని ఆంజనేయస్వామి గుడి సమీపంలో జాతీయ రహదారిపై గుంటూరు నుంచి వెళ్తున్న ఓ కారును ఢీకొంది. లారీ బెంగళూరు - చెన్నై రహదారిలో యుటర్న్ తీసుకుంటున్న సమయంలో కారును ఢీకొందని కారులో ఉన్న మహిళలు, పిల్లలకు ఎలాంటి ప్రమాదం సంభవించలేదు. కారు టైరు భారీ శబ్దంతో పేలినట్లు స్థానికులు తెలిపారు.

# తొలిరోజు 44 ఎంపీటీసీ నామినేషన్లు దాఖలు

### - టీడీపీ అభ్యర్థులదే పైచేయి

### - నామినేషన్ల వివరాలపై అధికారిక ప్రకటన ఏదంటూ ఓటర్ల ప్రశ్న

తిరుపతి రూరల్, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో తిరుపతి రూరల్ మండలంలో నామినేషన్ల ప్రక్రియ ఆసక్తికరంగా మారింది. ఒకవైపు ఎంపీటీసీ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేస్తుండగా, మరోవైపు ఇప్పటివరకు అందిన నామినేషన్ల వివరాలపై అధికారిక సమాచారం అందుబాటులో లేకపోవడంపై చర్చ మొదలైంది. తొలి రోజు 44 ఎంపీటీసీ నామినేషన్లు దాఖలైనట్లు అందిన జాబితా వెల్లడిస్తుండగా, ఎన్నికల అధికారులు సమగ్ర వివరాలను ప్రకటించాలని ఓటర్లు కోరుతున్నారు. అందిన జాబితా ప్రకారం మొత్తం 44 ఎంపీటీసీ నామినేషన్లలో తెలుగుదేశం పార్టీ (టీడీపీ) తరఫున 40, జనసేన పార్టీ నుంచి మూడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ (వైసీపీ) తరఫున ఒక నామినేషన్ దాఖలైనట్లు పేర్కొన్నారు. ఈ గణాంకాల ప్రకారం తొలి రోజు నామినేషన్లలో టీడీపీ అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉంది. అయితే ఈ వివరాలను ఎన్నికల అధికారులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. మల్లంగుంట ఎంపీటీసీ సెగ్మెంట్ నుంచి వైసీపీ తరఫున ఏ. కిరణ్ కుమార్ రెడ్డి నామినేషన్ దాఖలు చేసినట్లు జాబితాలో పేర్కొన్నారు. జనసేన తరఫున లింగేశ్వర నగర్, రణధీరపురం-2 సెగ్మెంట్ల నుంచి అభ్యర్థులు నామినేషన్లు సమర్పించినట్లు సమాచారం. మిగిలిన పలు ఎంపీటీసీ సెగ్మెంట్లలో టీడీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు జాబితా సూచిస్తోంది.

### నామినేషన్ల లెక్కలపై స్పష్టత ఏది?

తిరుపతి రూరల్ మండలంలో 40 ఎంపీటీసీ స్థానాలతోపాటు ఒక జడ్పీటీసీ స్థానం ఉండటం, లక్షా 40 వేలకుపైగా ఓటర్లు ఉండటంతో ఈ ఎన్నికలకు ప్రాధాన్యం ఏర్పడింది. ఇలాంటి కీలక సమయంలో రోజువారీగా ఎన్ని నామినేషన్లు దాఖలయ్యాయి, ఏయే స్థానాలకు అభ్యర్థులు పోటీకి దిగారు, ఎన్ని నామినేషన్లు స్వీకరించారు అనే వివరాలను రిటర్నింగ్ అధికారి (ఆర్ఓ), సహాయ రిటర్నింగ్ అధికారులు (ఏఆర్ఓలు) స్పష్టంగా వెల్లడించాలని స్థానిక ఓటర్లు కోరుతున్నారు. తొలిరోజు కూటమి తరఫున జడ్పీటీసీ అభ్యర్థితోపాటు 20 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు దాఖలైనట్లు గతంలో ప్రచారంలోకి వచ్చిన సమాచారం, తాజాగా అందిన 44 ఎంపీటీసీ నామినేషన్ల జాబితా మధ్య గణాంకాల పరంగా స్పష్టత అవసరమవుతోంది. ఈ వివరాలు వేర్వేరు సమయాల్లో సేకరించినవా, తాజా జాబితాలో మరిన్ని నామినేషన్లు చేరాయా అనే అంశాలను అధికారులు వెల్లడిస్తేనే వాస్తవ పరిస్థితి తెలుస్తుంది.

### అభ్యర్థులను వెనక్కి పంపారన్న ప్రచారంపై వివరణ ఏది?

వైసీపీకి చెందిన కొందరు ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చినప్పుడు అడ్డంకులు ఎదురై వెనక్కి వెళ్లినట్లు ప్రచారం జరుగుతోంది. అదే సమయంలో మల్లంకుంట నుంచి వైసీపీ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేసినట్లు జాబితాలో ఉండటంతో ఈ వ్యవహారంపై మరింత స్పష్టత అవసరమైంది. అయితే అభ్యర్థులను వెనక్కి పంపినట్లు వస్తున్న ఆరోపణలకు సంబంధించి అధికారిక నిర్ధారణ లేదు. నామినేషన్ల స్వీకరణలో ఏవైనా సమస్యలు ఎదురైతే వాటి కారణాలను సంబంధిత అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఎన్నికల నిబంధనల ప్రకారం అర్హులైన అభ్యర్థులందరికీ నామినేషన్లు దాఖలు చేసే అవకాశం కల్పించాలి. పత్రాల్లో లోపాలు ఉన్నట్లయితే నిబంధనల మేరకు వాటిని తెలియజేయాలి. ఏ అభ్యర్థికీ రాజకీయ అనుబంధంతో సంబంధం లేకుండా సమాన అవకాశం కల్పించడమే నిష్పక్షపాత ఎన్నికలకు పునాది.

## ఆర్డీఒ.. పోలీసుల మధ్య వాగ్వివాదం

కుప్పం, అక్టోబర్ 21 ప్రభాతవార్త



కుప్పం ఆర్ ్డఒ షేక్ మహ్మద్ హుసేన్, పోలీసుల మధ్య బుధవారం వాగ్వివాదం చోటుచేసుకున్నట్లు సమాచారం. ఆర్డీఒ కుప్పం మండల కార్యాలయం వైపుకు తన వాహనంలో రాగా అక్కడ బందోబస్తు నిర్వహిస్తున్న ఓ కానిస్టేబుల్ ఆర్డీఒను ఐడి కార్డ్ అడగడంతో పాటు వాహనం పార్కింగ్ విషయంగా కొంతసేపు వాగ్వివాదం చోటుచేసుకుని ఆపై సద్దుమణిగినట్లు

# చంద్రగిరి మండలంలో .. 10 సెగ్మెంట్లకు 17 నామినేషన్లు




చంద్రగిరి, అక్టోబర్ 21 ప్రభాతవార్త:చంద్రగిరి మండలంలో 16 ఎంపిటిసి స్థానాలకు గానూ మొదటి రోజు బుధవారం 10 సెగ్మెంట్లల్లో 17 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్లు దాఖలు నేపథ్యంలో పోలీసులు పటిష్ట భద్రతా వలయాన్ని ఏర్పాటు చేసి మండల పరిషత్ (నామినేషన్ దాఖలు కేంద్రం) కార్యాలయానికి వంద మీటర్లు దూరం వరకు అభ్యర్థులు, నామినీలు మినహా మరెవ్వరినీ అనుమతించలేదు. ఉదయం ప్రారంభ దశలో వైసిపి, టిడిపి శ్రేణుల మధ్యన తలెత్తిన ఘర్షణ వాతావరణంలో ఇద్దరు రక్తగాయాలకు గురయ్యారు. దీంతో పోలీసులు భద్రతను మరింత కట్టడి చేయడంతో సాయంత్రం వరకు నామినేషన్లు దాఖలు ప్రశాంతంగా జరిగింది. మొదటి రోజున వైసిపి నుండి ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. చంద్రగిరి-4 ఎస్.ధనంజయ రెడ్డి, బి.ముని దివ్య రెడ్డి తమ నామినేషన్లు దాఖలు చేశారు. శాన ఒబట్ల సెగ్మెంట్‌కు పాతశానంబట్లకు చెందిన ధర్మయ్యగారి దేవేంద్ర రెడ్డికి అత్తూరు తులశేశ్వర రెడ్డి, కొత్త శానంబట్లకు చెందిన ఎం.ధనశేఖర్‌కు జె.సతీష్ ప్రతిపాదించగా తమ నామినేషన్లు దాఖలు చేశారు. తొండవాడ సెగ్మెంట్‌కు కె.భువనేశ్వరి, దోర్నకంబాల పి.రాజేష్, పి.చెంగల్రాయులు, చంద్రగిరి-5 షేక్ సబీరా, చంద్రగిరి-1 యు.లలిత, యు.గురునాథ రెడ్డి, చంద్రగిరి-2 నాగలక్ష్మి దూదిపేట, జి.అనిత, చంద్రగిరి-3 కె.సునీల్, ఏ.రంగంపేట కె.రామకృష్ణ, కేసరం ప్రతాప్, చిన్న రామాపురం వినీల బొబ్బా, వి.వసుమతి తమ నామినేషన్లు దాఖలు చేశారు. ఎన్నికల పరిశీలకులు ఎం.వరప్రసాద్ ఐఎఎస్ నామినేషన్ కేంద్రాన్ని సందర్శించారు. రిటర్నింగ్ అధికారి శైలజ మాట్లాడుతూ 10 సెగ్మెంట్లకు 17 నామినేషన్లు దాఖలైనట్లు తెలిపారు. నామినేషన్ల స్వీకరణలో ఏఆర్‌ఓలు దుద్దెల అమరేశ్వరి, వెంకటరత్నం పాల్గొన్నారు. ఎంఎల్ఏ పులివర్తి నాని పోలీసులు ఏర్పాటు చేసిన బారికేడ్ల పరిధి వరకు వచ్చి నామినేషన్ల దాఖలు సరళిని పరిశీలించి వెళ్ళారు.

# తిరుపతి డివిజన్

## ప్రశాంతంగా ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియ



రామచంద్రాపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిటిసి అభ్యర్థుల నామినేషన్ల దాఖలు ప్రక్రియ బుధవారం ప్రశాంతంగా జరిగింది. పోలీసులు పటిష్ట భద్రత నడుమ నామినేషన్ల దాఖలు కొనసాగింది. సాయంత్రం 5 గంటలకు నామినేషన్ల దాఖలు ముగిసే సమయానికి టిడిపి తరపున 15 మంది అభ్యర్థులు తమ నామినేసన్ పత్రాలను దాఖలు చేశారు. మొదటి రోజు వైసిపి తరపున ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఈ కార్యక్రమంలో ఆర్ఓ వసంతబ్బాయి, ఏఆర్ఓలు మధుసూదన్‌రావు, పులిరామ్ సింగ్, సిబ్బంది తేజోవతి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## మహిషాసుర మర్ధిని అలంకరణలో దశమ దుర్గ

### శ్రీఉగ్రప్రత్యంగిరాకాళి అలంకరణలో ఏకాదశి దుర్గ

### వైభవంగా “శ్రీ ఉగ్రప్రత్యంగిరాకాళి” నవరాత్రి ఉత్సవాలు




చంద్రగిరి, అక్టోబర్ 3 ప్రభాతవార్త:

మహిషాసుర అలంకరణలో దశమదుర్గ, శ్రీ ఉగ్రప్రత్యంగిరాకాళి అలంకరణలో ఏకాదశి దుర్గ భక్తులకు దర్శనమిచ్చారు. తొండవాడ పంచాయతీలోని శ్రీ ఉగ్రప్రత్యంగిరా కాళిపీఠంలో శరన్నవరాత్రి ఉత్సవాలను పీఠాధిపతి సూరీ స్వామి వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం 6 గంటల నుండి 7.30 గంటల గంటల వరకు అమ్మవారికి అభిషేకం జరిపించారు. తదుపరి 9 గంటల నుండి 12 గంటల వరకు మహిషాసుర మర్ధిని హోమం నిర్వహించారు. అదేవిధంగా బుధవారం ఉదయం ఉగ్రప్రత్యంగిరా అలంకరణ అమ్మవారికి విశేష అలంకరణ గావించి, శ్రీఉగ్రప్రత్యంగిరా హోమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యం కల్పించారు.

# సత్యవేడులో నామినేషన్లకు వర్షం బ్రేక్..!

## 15 సెగ్మెంట్‌లో గడువు ముగిసే సమయానికి ఆరు నామినేషన్లే

సత్యవేడు, అక్టోబరు 21 ప్రభాతవార్త:

మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియకు వర్షం ఆటంకంగా మారింది. ఎన్నికల బరిలో అభ్యర్థులు పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేస్తారని భావించినప్పటికీ, ఉదయం నుంచి కురుస్తున్న వర్షంతో నామినేషన్ల దాఖలు మందకొడిగా సాగినట్లు కనిపించింది. మండలంలోని 28పంచాయతీల పరిధిలో ఉన్న 15 సెగ్మెంట్‌లో నామినేషన్ల దాఖలకు గడువు ముగిసే సమయానికి కేవలం ఆరు నామినేషన్లు మాత్రమే దాఖలయ్యాయి. సత్యవేడు 3వ సెగ్మెంట్ షణ్ముగం, సెంథిల్ కుమార్ నామినేషన్లు దాఖలు చేశారు. కన్నవరం సెగ్మెంట్ ఎంపీటీసీ అభ్యరినతగా విజయకుమార్ నామినేషన్ వేశారు. దాసుకుప్పం సెగ్మెంట్ వీర రాఘవులు నామినేషన్, కదిరివేడు సెగ్మెంట్ ఎంపీటీసీఅభ్యర్థిగా పరుచూరి స్పందన, అంబాకం సెగ్మెంట్ సంగీత నామినేషన్ దాఖలు చేశారు.

**వర్షంతో తగ్గిన సందడి...**

స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. అయితే ఉదయం నుంచి కురుస్తున్న వర్షం కారణంగా అభ్యర్థులు వారి మద్దతుదారుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురైనట్లు తెలుస్తోంది. దీంతో నామినేషన్ల దాఖలు ఆశించిన స్థాయిలో జరగలేదని స్థానికంగా చర్చ జరుగుతోంది. ఎన్నికల ప్రక్రియలో తొలి రోజు నామినేషన్ల సంఖ్య తక్కువగా



ఉండడంతో తదుపరి రోజుల్లో పరిస్థితి ఎలా ఉంటుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. రానున్న రోజుల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఎంత మంది నామినేషన్లు దాఖలు చేస్తారు..?ఏఏ సెగ్మెంట్‌లలో పోటీ తీవ్రంగా ఉండనుంది అన్నది వేచి చూడాలి.

## కేవీబీపురం నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించిన ఆర్డీవో



కేవీబీపురం, అక్టోబరు 21 ప్రభాతవార్త:

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ కేంద్రాలను శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి పరిశీలించారు. కేవీబీపురం మండలపరిషత్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. నామినేషన్ల ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా జరపాలని సూచించారు. ఎంపీటీసీ అభ్యర్థులు నామినేషన్లు సమర్పిస్తున్న తీరుపై ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరగాలన్నారు.

## భక్తి శ్రద్ధలతో కాళీబైరవ కళ్యాణం



రామచంద్రాపురం, అక్టోబర్ 21 ప్రభాతవార్త:

సురభి గోసంరక్షణశాలలో మంగళవారం విజయదశమిని పురస్కరించుకుని అత్యంత భక్తి శ్రద్ధలతో కాళీభైరవ కళ్యాణం జరిగింది. వేదపండితులు వేదమంత్రాలు పటిస్తూ కళ్యాణ తంతును సంప్రదాయబద్ధంగా ముగించారు. ఈ సందర్భంగా ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ మాట్లాడుతూ అమ్మవారి ఉగ్రశక్తి కరుణామయస్వరూపం కాళభైరవుని ధర్మరక్షణ తత్త్వాన్ని స్మరిస్తూ నిర్వహించిన ఈ కళ్యాణ మహోత్సవం ఆధ్యాత్మిక ఆనందాన్ని అందిస్తుందన్నారు. శ్రీకాళీమాత శక్తికి దుష్టశక్తుల సంహారానికి భక్తులకు రక్షణగా నిలుస్తుందన్నారు.

## ప్రశాంతంగా ప్రారంభమైన స్థానిక నామినేషన్ పర్వం

### మొదటి రోజు నలుగురు నామినేషన్




నారాయణవనం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి బుధవారం నుంచి ప్రారంభమైన ఎంపిటీసీ, జడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల పర్వం ప్రారంభమైనది. బుధవారం మొదటి రోజు కశింమిట్ట ఎంపిటీసీ సెగ్మంట్‌కి సంబంధించి తెలుగుదేశం పార్టీ తరపున కోనేటి సుధ, కోనేటి బాబు, అరణ్యకండ్రిగ ఎంపిటీసీ స్థానానికి టిడిపి తరపున పి మీనా, టి పుష్పలు నామినేషన్లు వేశారు. ఆర్ఓ దేవానంద్, ఎపిడిఓ అరుణ, తహశీల్దారు భార్గవిలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎన్నికల అబ్జర్వర్ వరప్రసాద్ జెసి గోవిందరావు, శ్రీకాళహస్తీ ఆర్డీఓ భానుప్రకాషరెడ్డి, పుత్తూరు డీఎస్పీ రవికుమార్, పుత్తూరు రూరల్ సిఐ రవీంద్ర, ఎస్ఐ గిరిబాబులు తన సిబ్బందితో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారుజ

## కేవీబీపురంలో మొదటి రోజు నామినేషన్ల దాఖలు



కేవీబీపురం, అక్టోబరు 21 ప్రభాతవార్త:

స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి నామినేషన్ దాఖలు ప్రక్రియ ప్రారంభమయ్యాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు సంబంధించి తొలి రోజు బుధవారం కేవీబీపురం మండలంలో టీడీపీ 4, వైసీపీ 3 నామినేషన్లు దాఖలయ్యాయి. ఎంపీటీసీ సెగ్మెంట్‌లో రాగిగుంట మేకల వెంకటేష్(ఎస్టీ), తుపాకులు ఏడుకొండలు(టీడీపీ), కోటమంగాపురం సెగ్మెంట్ మేర్వల గోపియాదవ్(బీసీ అన్ రిజర్వుడ్), కోవనూరు సెగ్మెంట్(ఎస్సీ), చెరివి పెంచలయ్య వైసీపీ(ఎస్సీ), చెరివి నారాయణ(ఎస్సీ)వైసీపీ, ఆదరం ఉమెన్ రమణమ్మ(ఎస్సీ), కేవీబీపురం సంధ్య(ఎస్సీ) నామినేషన్ దాఖలాల పత్రాలను రిటర్నింగ్ అధికారికి అందజేశారు. సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ ప్రక్రియ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో, తహసీల్దార్, అధికారుల ఆధ్వర్యంలో ఎంపీడీవో కార్యాలయంలో ఎన్నికల నామినేషన్ కార్యక్రమం నిర్వహించారు.

## నాగలాపురంలో మొదటి రోజు నామినేషన్ పోటాపోటీ



నాగలాపురం, అక్టోబరు 21 ప్రభాతవార్త:

నాగలాపురం మండల కేంద్రంలో బుధవారం మొదటి రోజు నామినేషన్‌పోటాపోటీగా దాఖలు చేశారు. మొత్తం 12 మంది దాఖలు చేశారు. నాగలాపురం-1 ఉదయకుమ, నాగలాపురం-2 సుకుమార్, నాగలాపురం-3 జి.గీత, బీరకుప్పం పి.బృంద, ఎస్ఎస్ పురం ఏ.మంజుల, వెంబాకం మునెమ్మ, చిన్నపట్టు శోభన, ఎస్ఎస్ పురం అయ్యప్ప, ఎస్ఎస్ పురం ఎం.శాంతి, చిన్నపట్టు గుర్రం ప్రియ తదితరులు నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి బాలాజీ నాయక్‌కు అందజేశారు.

## పోలింగ్ అధికారులకు శిక్షణ

విజయపురం, అక్టోబరు 21 ప్రభాతవార్త: మండల కేంద్రమైన విజయపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో పోలింగ్ అధికారులు 58 మంది పీవో, ఏపీవోలకు బుధవారం శిక్షణ సమావేశం నిర్వహించారు. పోలింగ్ రోజున నిర్వహించాల్సిన రికార్డు వివరాలను, పోలింగ్ నిర్వహణలో సూచనలను వివరించారు. ఎలాంటి విబేధాలకు తావు లేకుండా ఎన్నికలను నిర్వహించాలని ఆర్‌వో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. అనంతరం పోలింగ్ నిర్వహణ కేంద్రాన్ని పరిశీలించారు. సమావేశంలో ఎంపీడీవో కృష్ణయ్య, శిక్షణాధికారులు, పీవో, ఏపీవోలు పాల్గొన్నారు.

## చప్పగా తొలిరోజు నామినేషన్ ప్రక్రియ..

### 21 ఎంపీటీసీ స్థానాలకు దాఖలైంది రెండే




రేణిగుంట, అక్టోబర్ 21, ప్రభాతవార్త:

రేణిగుంట మండల పరిషత్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ తొలిరోజు ఆసక్తికరంగా సాగింది. మండలంలో మొత్తం 21 ఎంపీటీసీ స్థానాలు ఉండగా, బుధవారం నామినేషన్ల దాఖలుకు చివరి నిమిషం వరకు ఉత్కంఠ నెలకొంది. అయితే, **గడువు** ముగిసే సమయానికి తెలుగుదేశం పార్టీకి చెందిన ఇద్దరు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. బుధవారం నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనప్పటి నుంచి మధ్యాహ్నం నాలుగు గంటల వరకు అభ్యర్థుల నుంచి పెద్దగా స్పందన కనిపించలేదు. ఆ తర్వాత ఒక్కసారిగా సుమారు ఏడుగురు అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసేందుకు కేంద్రాలకు చేరుకున్నారు. అయితే, సాయంత్రం 5.30 గంటల వరకు అధికారులు కేవలం రెండు నామినేషన్లను మాత్రమే స్వీకరించారు. **గడువు** ముగియడంతో మిగిలిన అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండానే వెనుదిరగాల్సి వచ్చింది. దీంతో నామినేషన్ల ప్రక్రియ గురువారానికి కొనసాగనుంది.తొలిరోజు గాజులమండ్యం ఎంపీటీసీ1 సెగ్మెంట్ నుంచి రేణిగుంట టీడీపీ మండల అధ్యక్షుడు ముని చంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. కరకంబాడి ఎంపీటీసీ3 సెగ్మెంట్ నుంచి టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జి నాయుడు కోడలు సుప్రియ నామినేషన్ సమర్పించారు. తొలి రోజు దాఖలైన రెండు నామినేషన్లు టీడీపీకి చెందినవే కావడం గమనార్హం.నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన అభ్యర్థులకు మద్దతుగా పలువురు టీడీపీ నాయకులు కేంద్రాల వద్దకు చేరుకున్నారు. టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు చెర్లోపల్లి సుబ్రమణ్యరెడ్డి, రేణిగుంట పట్టణ అధ్యక్షుడు మహబూబ్ బాషా, క్లస్టర్ ఇన్‌చార్జి పుష్పనాదం, అన్నాసంపల్లి సీనియర్ నాయకుడు నాదముని రెడ్డి, జి.పాలెం సీనియర్ నాయకుడు రాజశేఖర్ రెడ్డి, కరకంబాడి క్లస్టర్ ఇన్‌చార్జి బుజ్జి నాయుడు, మామండూరు నాయకులు విశ్వనాథ్ యాదవ్, కన్నన్ రెడ్డి, తూకివాకం మాజీ సర్పంచ్ భాస్కర్ యాదవ్, నవాబు, మురళి తదితరులు హాజరయ్యారు. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా పోలీసు అధికారులు పటిష్ఠ భద్రతా చర్యలు చేపట్టారు. తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను ఆకస్మికంగా పరిశీలించారు. ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డి కూడా కేంద్రాలను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు.డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు అర్బన్ సీఐ జయచంద్ర, రూరల్ సీఐ మంజునాథరెడ్డి తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. నామినేషన్ కేంద్రాలకు సుమారు 200 మీటర్ల పరిధిలోకి అనుమతి లేని వ్యక్తులు రాకుండా ప్రత్యేక బారికేడ్లు ఏర్పాటు చేశారు. పోలీసుల పర్యవేక్షణలో తొలిరోజు నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది.

**నామినేషన్ల సరళిని పరిశీలించిన డాలర్స్ దివాకర్**

రేణిగుంట టీడీపీ ఎన్నికల పరిశీలకుడు, తుడా చైర్మన్, టీటీడీ కోఆప్షన్ సభ్యుడు డాలర్స్ దివాకర్ నామినేషన్ల ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించి వెళ్లారు. మొత్తం 21 ఎంపీటీసీ స్థానాలకు తొలిరోజు కేవలం రెండు నామినేషన్లే దాఖలు కావడంతో, తదుపరి రోజుల్లో నామినేషన్ల సంఖ్య ఎంత మేరకు పెరుగుతుందనే దానిపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి నెలకొంది. గురువారం నామినేషన్ల దాఖలుకు అభ్యర్థులు ఏ మేరకు ముందుకు వస్తారన్నది వేచి చూడాలి.

## వాడ వాడల ఘనంగా విజయదశమి పండుగ వేడుకలు

### వివిధ అలంకరణలో భక్తులకు దర్శినమిచ్చిన అమ్మవార్లు

నారాయణవనం, అక్టోబర్ 21 ప్రభాతవార్త :



మండలంలోని అన్ని అమ్మవారి ఆలయాల్లో దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు పదవరోజు మంగళ వారం విజయదశమి పండుగను పురస్కరించుకొని అమ్మవార్లు వివిధ రకాల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అరణ్యంకండ్రిగ పంచాయతీ పరిధి కైలాసనాధకోనలో వెలసిన కామాక్షాంభిగా అమ్మవారి దేవి నవరాత్రి ఉత్సవాల్లో ఉదయం రాజరాజేశ్వరి చందన అలంకరణలో దర్శనమిచ్చారు. సాయంత్రం శమి వృక్ష పూజ నిర్వహించారు. అంతకుముందు ఆలయాన్ని శుద్ధి చేసిన తర్వాత అభిషేకం చేశారు. అనంతరం అమ్మవారిని భక్తులు అధికసంఖ్యలో దర్శించుకున్నారు. అలాగే భక్తిశ్రద్ధలతో జలపాతంలో స్నానం చేశారు. సముదాయం వెలసిన టిటిడి ఆలయం అవనాక్షమ్మ అమ్మవారు మహిశాసుర దర్ధిని అమ్మవారి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ధ్వజ అవరోహణంతో ముగిసింది. అలాగే నారాయణవనం ద్రౌపతీదేవి అమ్మవారు నర్ధన దుర్గాదేవి అలంకరణలో, నారాయణవనం క్రాస్‌లో వెలసిన అవనాక్షమ్మ ఆలయంలోను అమ్మవారిని విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. సూపరింటెండెంట్ ధర్మయ్య, ఆలయ పర్యవేక్షకులు వెంకట శివ ప్రసాద్, షరాబు భరత్, అర్చకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వడమాలపేట మండలంలో 14 నామినేషన్లు దాఖలు

వడమాలపేట, అక్టోబరు 21 ప్రభాతవార్త:



వడమాలపేట మండలంలో 9 ఎంపీటీసీ స్థానాలు ఉండగా బుధవారం తొలి రోజు 14 నామినేష్లు దాఖలు చేశారు. వడమాలపేట ఎంపీటీసీకి మీన, పాదిరేడుకు హంస, పద్మావతి, ఎస్‌బీఆర్ పురంకు రాజేష్, కిరణ్‌బేజ, ఏఎం పురంకి చిన్నబ్బ, పూడి సెగ్మెంట్‌కి శమంతక మణి, ఎస్వీ పురంకి నారాయణరాజు, చాణిక్య వర్మ, పత్తి పుత్తూరు లోకనాథంశెట్టి, బాలినాయుడు కండ్రిగ యామాద్రి, పట్టాభిరెడ్డి, తిరుమణ్యాం ఎంపీటీసీకి స్వాతి, మాధురిలు నామినేషన్లు వేశారు. ఆర్‌వో సుధాకర్, ఎంపీడీవో శేషగిరిరావు, తహసీల్దార్ జరీనాలు నామినేషన్లు పరిశీలించి స్వీకరించారు. 14 మందిలో 13 మంది వైసీపీ పార్టీ తరపున నామినేషన్లు వేశారు.

## విజయపురంలో 8 ఎంపీటీసీ నామినేష్లు

విజయపురం, అక్టోబరు 21 ప్రభాతవార్త:



విజయపురం మండలంలో మొత్తం 9 ఎంపీటీసీ స్థానాలకు బుధవారం 8 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఆర్‌వో జయచంద్రారెడ్డి తెలిపారు. కోసలనగరం ఎంపీటీసీకి జి.సరిత(టీడీపీ), శ్రీహరిపురం ఎంపీటీసీకి ఆర్.నగేష్(టీడీవీ), ఎం.చిరంజీవి(వైసీవీ), బూచివానత్తం ఎంపీటీసీకి కె.మురళి(టీడీపీ), కేవీ పురం ఎంపీటీసీకి టి.అల్లెమ్మ(టీడీపీ), జగన్నాథపురం ఎంపీటీసీకి కల్పన(టీడీపీ), కాంచన(టీడీపీ), పన్నూరు ఎంపీటీసీకి బి.గౌతమి(టీడీపీ)మొత్తం 8 నామినేషన్ల దాఖలు వచ్చినట్లు తెలిపారు.

22 CTR 5:22 CTR 5.qxd 10/22/2026 12:08 AM Page 1



# తిరుపతి డివిజన్

## పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిబంధనలను అధికారులు ఖచ్చితంగా పాటించాలి

### జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు, మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణ

తిరుపతి కార్పొరేషన్ , అక్టోబరు 21 ప్రభాతవార్త

మున్సిపల్ సాధారణ ఎన్నికలు-2026లో భాగంగా ఈ నెల 28న నిర్వహించనున్న పోలింగ్ ప్రక్రియను సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలు, మార్గదర్శకాలను అధికారులు ఖచ్చితంగా పాటించాలని జాయింట్ కలెక్టర్ ఆర్. గోవిందరావు మరియు మున్సిపల్ కమిషనర్ ఎం. జయకృష్ణ సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల నిర్వహణ, బ్యాలెట్ బాక్సుల వినియోగంపై ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బందికి బుధవారం తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ సిబ్బంది తమ విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని, ఎన్నికల ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. ప్రిసైడింగ్ అధికారులు తప్పనిసరిగా పి.ఓ. డైరీని వినియోగించాలని, ఎన్నికల విధులకు సంబంధించిన హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా చదివి అందులోని నిబంధనలు, విధివిధానాలపై పూర్తి అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ప్రతి అధికారి తనకు



కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతను కాపాడాలని పేర్కొన్నారు. శిక్షణ కార్యక్రమంలో పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారుల విధులు, ఎన్నికల నియమావళి అమలు, ఓటర్లకు అవసరమైన సౌకర్యాల కల్పన, ఎన్నికల సామగ్రి నిర్వహణ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. బ్యాలెట్ బాక్సుల వినియోగం, పోలింగ్ ప్రారంభానికి ముందు నిర్వహించాల్సిన తనిఖీలు, బ్యాలెట్ బాక్సుల సీలింగ్ ప్రక్రియ, వాటి భద్రత, రవాణా, పోలింగ్ ముగిసిన అనంతరం బాక్సులను సంబంధిత అధికారులకు అప్పగించే విధానాలను వివరించారు. ఎన్నికల సమయంలో అనుసరించాల్సిన ప్రతి విధానాన్ని నిబంధనల ప్రకారం అమలు చేయాలని సూచించారు. పోలింగ్ సిబ్బంది విధుల నిర్వహణలో పూర్తి బాధ్యతాయుతంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాలని, ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ తెలిపారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంతమైన ఎన్నికల నిర్వహణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ శిక్షణ కార్యక్రమంలో అదనపు కమిషనర్ శారదా దేవి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఇతర పోలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

## పెనగలూరులో ప్రశాంతంగా ఎంపిటిసి నామినేషన్లు

### జనసేన 09, టీడీపీ 07, ఇండిపెండెంట్ 01 నామినేషన్లు



పెనగలూరు, అక్టోబర్ 21 ప్రభాతవార్త

పెనగలూరు మండలంలో తొలిరోజు ఎంపిటిసి నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. మండలంలో 11 ఎంపిటిసి స్థానాలకు 09 స్థానాలకు నామినేషన్‌లు వేసినట్లు ఆర్వో చిన్న రెడ్డయ్య తెలిపారు. ఇందులో జనసేన నుండి 9 నామినేషన్లు, టీడీపీ నుండి 7 నామినేషన్లు, ఒకరు ఇండి పెండెంట్‌గా నామినేషన్ వేసినట్లు చెప్పారు. పెనగలూరు మండలంలో తొలి రోజు ఎటువంటి సంఘటనలు జరగకుండా ఎస్పై అరుణ్ కుమార్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. నామినేషన్ కేంద్రం నుండి 144 సెక్షన్ ను పక్కాగా అమలు చేసారు. కొండూరు1 ఎంపిటిసి కి మద్దెల రాములమ్మ (జనసేన) మరియు వద్దే రజిత (జనసేన), కొండూరు 2 ఎంపిటిసి కి ఉదయగిరి శంకరయ్య (జనసేన), వెలగచర్ల నరసింహులు (జనసేన), పొగడతోటి మనోహర్ (జనసేన), శింగారెడ్డిపల్లి ఎంపిటిసికి కోనేటి రాజేశ్వరి (జనసేన), కోనేరు జ్యోతి (జనసేన), ఈటిమార్పూరం ఎంపిటిసికి కోడూరు వెంకటయ్య (టీడీపీ), కోడూరు వెంకట సుబ్బయ్య (టీడీపీ), ఓబిలి ఎంపిటిసి కి కొడిదెల సాయి కుమార్ (జనసేన), గోబ్బూరు హరి కృష్ణ (జనసేన), నల్లపురెడ్డిపల్లి ఎంపిటిసి కి మొలకల కళావతి ( ఇండిపెండెంట్), అనంతంపల్లి ఎంపిటిసికి రాజబోయిన సులోచన (టీడీపీ), రాజబోయిన శైలజ (టీడీపీ), పెనగలూరు 2 ఎంపిటిసికి కొత్త మధుసుధన్ రావు ( టీడీపీ ), కొత్త బాలకృష్ణ (టీడీపీ), పొందలూరు ఎంపిటిసికి కంభం సురేష్ కుమార్ రెడ్డి (టీడీపీ) నామినేషన్‌లు వేశారు. పెనగలూరు 1, కట్టావారిపల్లి ఎంపిటిసికి నామినేషన్‌లు ఎవరూ వేయలేదు. తహసీల్దార్ సుమని, ఎంపీడీవో మోహన్, డిప్యూటీ ఎంపీడీవో శ్రీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## స్థానిక పోటీలో చైర్మన్ అభ్యర్థులు 3, కౌన్సిలర్ అభ్యర్థులు 89

పుత్తూరు, అక్టోబరు 21 ప్రభాతవార్త :

మునిసిపల్ ఎన్నికలకు సంబంధించి బుధవారం నామినేషన్ల ఉప సంహరణ అనంతరం పుత్తూరు మునిసిపాలిటీలో ముగ్గురు చైర్మన్ అభ్యర్థులు, కౌన్సిలర్ అభ్యర్థులు పోటీలో వున్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున ఏకాంబరం, డి.శంకర్ నామినేషన్లు ఉపసంహరించుకున్నందున ఆ పార్టీ తరఫున చైర్మన్ అభ్యర్థిగా డి.జయప్రకాశ్ (చిట్టి) రంగంలో వున్నారు. జనసేన పార్టీ తరఫున డి.ఎన్.ఏలుమలై (అమ్ములు) చైర్మన్ అభ్యర్థిగా పోటీలో వున్నారు. అలాగే మొత్తం 36 వార్డులకు గాను 19వ వార్డు నుంచి టిడిపి అభ్యర్థి ఎన్.కవిత ఏకగ్రీవమవడంతో తెలుగుదేశం పార్టీ తరఫున 32 మంది కౌన్సిలర్ అభ్యర్థులు, వైసిపి తరపున 35, జనసేన తరపున 3, బిజెపి తరపున 3 ముగ్గురు, సిపిఐ 2 అభ్యర్థులు, స్వతంత్ర అభ్యర్థులుగా 14 మంది కలిసి మొత్తం 89 మంది పోటీలో మిగిలారు.

## మొదటిరోజు ప్రశాంతంగా నామినేషన్ల ప్రక్రియ

చిట్వేలి, అక్టోబర్ 21,ప్రభాతవార్త :



చిట్వేలి మండలంలో మొదటిరోజు బుధవారం ఎంపీటీసీ నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. ఎంపీడీవో కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి (ఆర్వో) జై భరత్ రెడ్డి, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు ఎమ్మార్వో నరసింహారావు ఎంపీడీవో శ్రీనివాసులు ఆధ్వర్యంలో అభ్యర్థుల నుంచి నామినేషన్లు స్వీకరించారు. మొత్తం 12 నామినేషన్లు నమోదు కాగా వీటిలో వైసీపీ నుంచి 5, జనసేన నుంచి 4, టీడీపీ నుంచి 2, స్వతంత్ర అభ్యర్థి నుంచి ఒక నామినేషన్ దాఖలైనట్లు అధికారులు వెల్లడించారు.వీరిలో కేఎస్ అగ్రహారం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున ఇద్దరు, తిమ్మయ్యగారిపల్లి నుంచి టీడీపీ తరఫున ఇద్దరు, నాగవరం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున ఇద్దరు నామినేషన్లు వేశారు. చిట్వేలి నుంచి జనసేన తరఫున నలుగురు, వైఎస్సార్‌సీపీ తరఫున ఒకరు, స్వతంత్ర అభ్యర్థిగా ఒకరు, మాలేమార్పురం నుంచి జనసేన తరఫున ఒకరు నామినేషన్ వేసినట్లు అధికారులు వెల్లడించారు.నామినేషన్ల స్వీకరణకు కార్యాలయంలో అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు.ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో భద్రతా ఏర్పాట్లు చేపట్టడంతో ప్రక్రియ సజావుగా సాగింది.

## వైభవంగా మహాలక్ష్మి అమ్మవారి కళ్యాణోత్సవం




నింద్ర,అక్టొబరు 21 ప్రభాతవార్త :

మండలంలోని కెఆర్ పాళెం గ్రామంలో వెలసిన శ్రీమహలక్ష్మి అమ్మవారి దేవస్థానం గీతా మందిర ఆశ్రమం నందు బుదువారం నవరాత్రి ముగింపు ఉత్సవాలు ఘనంగా జరిగింది.ఈసందర్భంగా ఉదయం నగర సంకీర్తనతో మహిళలు 108 బిందెలతో పాలభిషేకం జరిగింది.అనంతరం శ్రీమహా లక్ష్మి అమ్మవారి కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు. కల్యాణోత్సవానికి ముఖ్యఅతిథిగా తమిళనాడు విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు ఆర్.ఆర్ గోపాల్‌జీ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో గీతమందిర్ ఆశ్రమం పీఠాదిపతి పుండరిక వరదానందస్వామి. గ్రామప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు





చిట్వేలి, అక్టోబర్ 21, ప్రభాతవార్త :

చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా 11 రోజులపాటు విశేష అలంకారాలతో వైభవంగా నిర్వహించిన దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు చిట్వేలి మండలంలో ఘనంగా ముగిశాయి. బుధవారం శ్రీ వాసవి మాత లక్ష్మీ ్మదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా మంగళవారం శ్రీ భద్రకాళి అమ్మవారు రాజరాజేశ్వరి దేవి అలంకారంలో, శ్రీ వాసవి మాత సమీ రూపంలో, శ్రీ శ్యామలాంబ అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. బుధవారం శ్రీ భద్రకాళీ సమేత వీరభద్రుడు పాత చిట్వేలి, చిట్వేలి గ్రామ ప్రధాన వీదుల్లో రథం పై ఊరేగి భక్తులకు దర్శనమిచ్చారు.సాయంత్రం ఆర్యవైశ్యులు శ్రీ వాసవి మాత రథోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో పెద్ద ఎత్తున నిర్వహించారు. కార్యక్రమంలో విశేషంగా భక్తులు పాల్గొన్నారు.

## రొంపిచెర్ల మండలంలో 7 నామినేషన్లు దాఖలు

రొంపిచర్ల, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

రొంపిచర్ల మండలంలో బుధవారం ఎంపీటీసీ ఎన్నికలకు సంబంధించి ఏడు నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో మధుసూదన్ రెడ్డి తెలిపారు. పెద్దగొట్టిగల్లు నుంచి చల్లా సుప్రియ, పెద్దమల్లెల నుంచి ఈశ్వర మ్మ, షేక్ మొహసిన్, చిచ్చలవారిపల్లె నుంచి సంపూర్ణ, గానుగచింత నుంచి ముద్దుకృష్ణ, రొంపిచర్ల-1 నుంచి షేక్ జహీదా, మోటుమల్లెల నుంచి హేమలత నామినేషన్లు దాఖలుచేసినట్లు ఆయన వెల్లడించారు.

## పుల్లంపేటలో 18 నామినేషన్లు



పుల్లంపేట, అక్టోబర్ 21 ప్రభాతవార్త :

పుల్లంపేట మండలంలో మొత్తం 11 ఎంపీటీసీలకు బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో 18 నామినేషన్లలో దాఖలు చేశారు. ఇందులో మూడు జనసేన కేటాయించగా మిగిలినవి 15 మంది అభ్యర్థులు తెలుగుదేశం తరఫున నామినేషన్ దాఖలు చేశారు. ఎంపిటిసి వారిగా వివరాలు ఇలా ఉన్నాయి. పుల్లంపేట ఎంపీటీసీ అభ్యర్థిగా భీమిశెట్టి నారాయణ, జాగువారిపల్లె ఎంపీటీసీ అభ్యర్థులుగా పెరియవరం విజయ, పెరియవరం శంకర్ రెడ్డి, దళాయపల్లి ఎంపిటిసి అభ్యర్థులుగా కలకట్ల అనూష, కలకట్ల వెంకట సిద్దయ్య అప్పారావుపేట అభ్యర్థిగా సిగమాల శుభ రత్న, అనంతసముద్రం అభ్యర్థిగా మామిళ్ళ సుబ్బలక్ష్మి ్మ,వత్తలూరు అభ్యర్థిగా నీలి ఈశ్వరయ్య జనసేన, రామసముద్రం అభ్యర్థిగా వెలక చర్ల మనోహర్, టీ కమ్మ పల్లె అభ్యర్థిగా వర్దన్న గారి శ్యామల, జనసేన, రంగంపల్లి అభ్యర్థిగా పసుపులేటి వెంకటరమణలు నామినేషన్లు దాఖలు చేశారు. మండల వ్యాప్తంగా మొత్తం 11 ఎంపీటీసీలు గాను మూడు జనసేన 15 మంది టిడిపి అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేశారు ఇందులో కొసమెరుపు కూటమిలో భాగంగా బిజెపి పార్టీకు ఒక్క ఎంపిటిసి స్థానం కూడా కేటాయించకపోవడం బిజెపి పార్టీ అభిమానుల్లో తీవ్ర నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

## యంపిటిసి రెండు నామినేషన్ దాఖలు

నింద్ర,అక్టొబరు 21 ప్రభాతవార్త :

మండల కేంద్రంలో యంపిడిఓ కార్యాలయంలో బుదువారం అత్తూరు,ఎలకాటూరు యంపిటిసిలకు రెండు నామినేషన్‌లు దాఖలు అయినట్లు ఆర్ఓ విజయరావు తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అత్తూరు యంపిటిసి సభ్యులుగాటి.ఏలుమలై,ఎలకాటూరు యంపిటిసిగా తుపాకుల భారతి నామినేషన్ చేసినట్లు ఆయన తెలిపారు.

## విద్యానగర్‌లో చోరీ



తిరుపతి,అక్టోబర్ 21ప్రభాతవార్త:

తిరుపతి నగర శివార్లలోని విద్యానగర్ నాన్ టీచింగ్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి ఓ ఇంట్లో చోరీ జరిగింది. 7కిలోల వెండి, 90 గ్రాములు బంగారు, 60వేలు నగదు అపహరణకు గురైనట్లు పోలీసులకు ఫిర్యాదు అందింది. దొంగల కదలికలు సిసి కెమెరాలో రికార్డైంది, ఇనుప గ్రిల్ కు వున్న తాళాలు పగలగొట్టి చోరీకి పాల్పడ్డారు. విషయం తెలుసుకున్న తిరుపతి రూరల్ సిఐ మద్దయ్యాచారి చోరీ జరిగిన ఇంటికి చేరుకుని పరిశీలించారు. బాధితుడు గిరిధర్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు .

## అర్హులైన అభ్యర్థులకు నామినేషన్ల దాఖలు

### జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ..

తిరుపతి కలెక్టరేట్, అక్టోబరు 21 ప్రభాతవార్త :

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా నామినేషన్లు దాఖలు చేసేందుకు అవకాశం లభించని, తగిన భద్రత లేక నామినేషన్లు సమర్పించలేకపోయిన అభ్యర్థులకు నామినేషన్లు దాఖలు చేసేందుకు అవసరమైన అవకాశం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ. బుధవారం ఈ అంశంపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించి, తదుపరి చేపట్టాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు తిరుపతి కలెక్టరేట్ లోని మిని విసి హాల్ నుండి కలెక్టర్ డా. ఎస్.వెంకటేశ్వర్, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ ఎం జయకృష్ణ, డి ఆర్ ఓ జి. నరసింహులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలు, మార్గదర్శకాలను పూర్తిస్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ సంబంధిత అధికారులను ఆదేశించారు. నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారంటూ అందిన ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, విశ్వసనీయ ఆధారాలతో కూడిన సమగ్ర నివేదికలను తక్షణమే సమర్పించాలని సూచించారు. నామినేషన్ల దాఖలుకు అదనంగా ఒకటి లేదా రెండు రోజుల సమయం కల్పించే అవకాశం ఉంటుందని, ఈ అవకాశం అందరు అభ్యర్థులకు వర్తించదని, నామినేషన్లు దాఖలు చేయకుండా అడ్డుకున్నారని లేదా అవకాశం నిరాకరించారని అధికారికంగా ఫిర్యాదు చేసిన అభ్యర్థులకు మాత్రమే వర్తిస్తుందని కమిషనర్ స్పష్టం చేశారు. 19 పురపాలక సంఘాలకు సంబంధించి అందిన ఫిర్యాదులను పరిశీలించి, అర్హులైన అభ్యర్థుల విషయంలో వాస్తవాలను నిర్ధారించాలన్నారు. అభ్యర్థులు సమర్పించిన ఫిర్యాదుల్లోని అంశాలను సంబంధిత ఆధారాలతో ధ్రువీకరించాలని, నామినేషన్ల స్వీకరణ సమయంలో ఎదురైన ఇబ్బందులు, జరిగిన ఘటనల వివరాలను సేకరించాలని సూచించారు.

## ఓబులవారిపల్లి 1 ఎంపీటీసీగా నామినేషన్ వేసిన ముక్కాసాయి వికాస్ రెడ్డి...



ఓబులవారిపల్లి, 21 అక్టోబర్ ప్రభాతవార్త

ఓబులవారిపల్లి 1 ఎంపీటీసీ అభ్యర్థిగా ముక్కాసాయి వికాస్ రెడ్డి బుధవారం టిడిపి తరపుననామినేషన్ దాఖలు చేశారు. కూడా చైర్మన్ టిడిపి ఇన్చార్జ్ ముక్కా.రూపానంద రెడ్డి సతీమణి ముక్క, వరలక్షి ్మ పలువురు కూటమి నాయకులు, కుటుంబ సభ్యుల మధ్య ఎంతో ఉత్సాహంగా ఆనందంగా నామినేషన్ దాఖలు చేశారు. అంతేకాకుండా కొన్ని చెదురు ముదురు సంఘటనలతో కొంత ఇబ్బంది కరగం గా ఉన్న దాదాపు ప్రశాంతంగా నామినేషన్ జరిగాయని ఎన్నికల ఆర్వో సురేష్ కుమార్ తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాదాపు 25 అప్లికేషన్ రాగా అందులో 21 టీడీపీకి రెండు జనసేనకు రెండు అప్లికేషన్లు తప్పు ఒప్పులు కొరకు డబుల్ అప్లికేషన్లు రావడం జరిగాయని మొత్తానికి 23 ఎంపీటీసీ అప్లికేషన్లు వచ్చినట్లు ఆయన తెలిపారు ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు.

## నేడు గంగమ్మ ఆలయంలో బహిరంగ వేలం

తిరుపతి,అక్టోబర్ 21ప్రభాతవార్త:




తాతయ్య గుంట గంగమ్మ ఆలయంలో ఒక్క సంవత్సర కాలానికి భక్తులు అమ్మవారికి సమర్పించు వస్త్రాలు,కొబ్బరిచిప్పలు సేకరించుకొను హక్కులకు గురువారం బహిరంగ వేలం ఉంటుందని ఆలయ ఈఓ జయకుమార్ తెలిపారు.వెయ్యికళ్ల దుత్తలు విక్రయాలకు, సజీవ కోళ్ళు సేకరించుకొనుటకు పాదరక్షలు భద్రపరచి రుసుము వసూలు చేసుకొనేందుకు నేడు ఉదయం 11 గంటలకు ఆలయ కార్యాలయం వద్ద బహిరంగ వేలంము నిర్వహిస్తారు.

## ఓబులవారిపల్లి 2వ ఎంపీటీసీ అభ్యర్థిగా బండి కృష్ణయ్య నామినేషన్



ఓబులవారిపల్లి 2 వ, ఎంపీటీసీ అభ్యర్థిగా ఓబులవారిపల్లి పంచాయతీలో ఉన్న శివ శంకరాపురం గ్రామానికి చెందిన బండి కృష్ణయ్య బుధవారం ఎన్నికలరిటర్నింగ్ ఆఫీసర్ సురేష్ కుమార్, అధికారులు ఎంపీడీవో రాజేంద్ర తాసిల్దార్ సిద్దేశ్వర రావు ఇన్చార్జి ఎంపీడీవో కృష్ణయ్య. ఈవోపీఆర్డి రామ్మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో నామినేషన్ దాఖలు చేశారు. ప్రజల అండదండలు కూటమి నాయకులు మద్దతుతో నామినేషన్ వేయడం జరిగిందని ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు.

## కోడూరులో భారీ వర్షం...

రైల్వేకోడూరు అర్బన్, అక్టోబర్ 21 ప్రభాతవార్త

రైల్వేకోడూరు పట్టణంలో గత రెండు రోజులుగా భారీగా వర్షం పడుతుంది. ఉరుములతో కూడిన భారీ వర్షం రావడంతో ప్రజలు ఇంటిలో నుండి బయటకు రాకుండా ఇంటిలోనే బిక్కుబిక్కుమంటూ కాలయాపన చేశారు. బుధవారం తెల్లవారుజామున భారీగా వర్షం పడటంతో ప్రధాన రహదారులు జలమయమై, మురికి గుంతలు కల్పించాయి. అయితే చాలా కాలానికి తర్వాత వర్షం పడటంతో రైతుల్లో ఒక్కింత సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇదే వర్షం రెండు మూడు రోజులు ఎక్కువగా కురిస్తే గుంజినీరుకు నీటి ప్రవాహం సాగుతుందని రైతులు అంటున్నారు.

## శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్విమ్స్, బర్డ్ విశేష వైద్య సేవలు

### - అలిపిరి, శ్రీవారిమెట్టు ప్రథమ చికిత్స కేంద్రాల ద్వారా 4 వేల మంది భక్తులకు ఉచితంగా మందుల పంపిణీ

### - దాదాపు 100 మంది వైద్యులు, వైద్య సిబ్బంది సేవలు - స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్

తిరుపతి హెల్త్, అక్టోబర్ 21, ప్రభాతవార్త

మానవ సేవే మాధవ సేవ అనే మహోన్నత స్ఫూర్తిని ఆచరణలో ప్రతిబింబిస్తూ, శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమల శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులకు స్విమ్స్ విశేష వైద్య సేవలను అందించిందని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సంచాలకులు, ఉపకులపతి డాక్టర్ గుడారు జగదీష్ తెలిపారు. భక్తుల ఆరోగ్య పరిరక్షణ, వారి యాత్రలో ఎదురయ్యే సాధారణ ఆరోగ్య సమస్యలకు తక్షణ సహాయం అందించడం, అవసరమైన సమయంలో ఉచితంగా మందులు పంపిణీ చేయడం లక్ష్యంగా స్విమ్స్ చేపట్టిన ఈ సేవా కార్యక్రమం విజయవంతంగా కొనసాగిందని ఆయన వెల్లడించారు. తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా తిరుమలకు కాలినడకన వచ్చే భక్తులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు స్విమ్స్ ఆధ్వర్యంలో శ్రీవారిమెట్టు వద్ద ఏర్పాటు చేసిన ఫస్ట్ ఎయిడ్ వైద్య కేంద్రాన్ని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. గుడారు జగదీష్ సందర్శించి, వైద్య సేవలను పరిశీలించారు. శ్రీవారిమెట్టు ఫస్ట్ ఎయిడ్ కేంద్రాన్ని సందర్శించి ఉచితంగా మందులు పంపిణీ



చేయడం జరిగింది. 2026 అక్టోబర్ 12 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించిన శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా అలిపిరి, శ్రీవారిమెట్టు కాలినడక మార్గాల్లో స్విమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రథమ చికిత్స కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ రెండు కేంద్రాల ద్వారా మొత్తం సుమారు 4,000 మంది భక్తులకు ఉచితంగా మందులు అందించి వైద్య సహాయం అందించినట్లు డాక్టర్ గుడారు జగదీష్ వివరించారు. దాదాపు 100 మంది స్విమ్స్ వైద్యులు, వైద్య సిబ్బంది ఈ సేవా కార్యక్రమంలో భాగస్వాములై భక్తులకు అవసరమైన వైద్య సహాయాన్ని అందించారని పేర్కొన్నారు.

#### దాదాపు 100 మంది వైద్య సిబ్బంది సమష్టి కృషి

ఈ సేవా కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో స్విమ్స్ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, ఇతర వైద్య సిబ్బంది కీలక పాత్ర పోషించారని డాక్టర్ గుడారు జగదీష్ తెలిపారు. దాదాపు 100 మంది సిబ్బంది వివిధ దశల్లో సేవలందిస్తూ, భక్తులకు అవసరమైన వైద్య సహాయం అందుబాటులో ఉండేలా కృషి చేశారని పేర్కొన్నారు. మానవ సేవే మాధవ సేవ' అనే మహోన్నత సందేశాన్ని ఆచరణలో చూపిస్తూ, శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో స్విమ్స్ అందించిన వైద్య సేవలు భక్తుల ఆరోగ్య పరిరక్షణకు తోడ్పడటంతోపాటు, వైద్యం వెనుక ఉన్న మానవత్వం, సేవాభావం, సామాజిక బాధ్యతలను ప్రతిబింబించాయని డాక్టర్ గుడారు జగదీష్ తెలిపారు.

## బందోబస్తులో ఎస్ఐ సమయస్ఫూర్తి

తిరుపతి,అక్టోబర్ 21ప్రభాతవార్త:



ఎన్నికల నామినేషన్ బందోబస్తులో ఉన్న ఎస్ఐ సమయస్ఫూర్తితో అభ్యర్థి పోగొట్టుకున్న సర్టిఫికెట్ల ఫైల్ తిరిగి చేర్చగలిగారు. చంద్రగిరి జడ్పిటిసి అభ్యర్థి నామినేషన్ వేసేందుకు తిరుపతి ఎంఆర్ఓ కార్యాలయానికి బుధవారం ఉదయం వచ్చారు. ఆ సమయంలో విలువైన పత్రాలు కలిగిన ఫైల్ ను ఆయన జారవిడుచుకున్నారు.ఫుట్పాత్ పై ఈ ఫైల్ ని గమనించిన అలిపిరి ఎస్ఐ దుర్గ ప్రసాద్ ఫైల్ ని గమనించి, సదరు వ్యక్తి వివరాలను ఆధార్ కార్డు బట్టి ఫోన్ నెంబర్ తెలుసుకున్నారు. ఆపై సొంతదారునికి ఫోన్ చేసి ఫైల్ అందించారు.

